ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సోమవారం 15 సెప్టెంబరు 2025



మాట్లాడుతున్న జేపీ నడ్డా

బీజేపీలో జోష్

రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ 'సారథ్యం యాత్ర' ముగింపు సభ సూపర్ సక్సెస్

- హాజరైన జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు
- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తున్నదన్న నడ్డా
- గ్రామీణ ప్రజలకు పార్టీని చేరువచేయాలని మాధవ్ పిలుపు
- గత వైసీపీ పాలనపై బీజేపీ నేతల తీవ్ర విమర్శలు
- పార్టీ శ్రేణులతో కిటకిటలాడిన రైల్వే మైదానం

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):
భారతీయ జనతా పార్టీ నగరంలోని రైల్వే మైదానంలో ఆదివారం నిర్వహించిన 'సారథ్యం యాత్ర' ముగింపు సభ విజయవంతమైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 50 రోజులపాటు యాత్ర నిర్వహించారు. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు వివిధ వర్గాలతో మమేకమయ్యారు. ఈ యాత్ర ఆదివారం ముగిసింది. ఈ నేపథ్యంలో రైల్వే మైదానంలో బహిరంగసభను నిర్వహించారు. సభకు రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా హాజరై శ్రేణులనుద్దేశించి ... మిగతా 6వ పేజీలో



సభకు హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు



'సారథ్యం యాత్ర' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు జేపీ నడ్డా, మాధవ్, శ్రీనివాసవర్మ, సీఎం రమేశ్, సత్యకుమార్ యాదవ్, విష్ణుకుమార్‌రాజు, సోము వీర్రాజు, ఎన్.రామకృష్ణారెడ్డి, తదితరులు



మాట్లాడుతున్న మాధవ్

నూరు శాతం హామీల అమలు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):
గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. సారథ్యం ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. సారథ్యం పేరుతో మలి విడత యాత్ర ప్రారంభిస్తామన్నారు. జీఎస్టీ సరళీకరణతో నిత్యావసర సరకుల ధరలు తగ్గుముఖం పడుతున్నాయన్నారు. దేశం నుంచి పేదరికం తొలగేలా కేంద్రం పథకాలు రూపొందిస్తోందన్నారు. సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఇచ్చి ఈ ప్రాంత ప్రజల కలను మోదీ సాకారం చేశారన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలను కల్పించనున్నారన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకు మార్ యాదవ్ మాట్లాడుతూ 2047 నాటికి వికసిత్ భారత్ నినాదంతో విశ్వగురు స్థానానికి చేరుకోవడమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. ఐదేళ్ల వైసీపీ విధ్వంసం నుంచి బయటపడేందుకు చర్యలు చేపడుతున్నా మన్నారు. బీజేపీని సంస్థాగతంగా విస్తరించాల్సిన అవసరం ఉందని, ఇందుకు కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలన్నారు. బీజేపీ ఫ్లోర్‌లీడర్ విష్ణు కుమార్‌రాజు మాట్లాడు తూ ఏ రాష్ట్రానికి ఇవ్వనన్ని నిధులు రాష్ట్రానికి కేంద్రం అందిస్తోం దన్నారు. 2019లో ఏపీ ప్రజలు తప్పు చేసి జగన్‌ను గెలిపించడంతో ఐదేళ్ల రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. భవిష్యత్తును బంగారంగా తీర్చిదిద్దే దిశగా ముందుకు వెళుతున్నామన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్ కలయికతో రాష్ట్రం వికసిత్ ఏపీగా రూపాంతరం చెందుతోందన్నారు.

నేడు డీఎస్సీ ఎంపిక జాబితా

ఉమ్మడి జిల్లాలో 1,134 మందికి ఉద్యోగాలు

- ఐదు ఉర్దూ ఎస్జీటీ పోస్టులకు అభ్యర్థుల కరువు
- 19న అమరావతిలో నియామకపత్రాల అందజేత
- 22వ తేదీ నుంచి జిల్లాలో రెసిడెన్షియల్ శిక్షణ



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):
డీఎస్సీలో మెరిట్ మేరకు ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల జాబితా సోమవారం విడుదల కానున్నది. ఎంపికైన అభ్యర్థుల వివరాలతో కూడిన జాబితాలను జిల్లాల వారీగా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. దీంతోపాటు అభ్యర్థుల వివరాలతో ముద్రించిన కాపీలు జిల్లా కలెక్టర్, డీఈవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంచనున్నారు. సబ్జెక్టు, రిజర్వేషన్ల వారీగా మెరిట్, కటాఫ్ మార్కుల వివరాలతో అభ్యర్థుల వివరాలు వెల్లడికానున్నాయి.

ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులకుగాను 1,134 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఉర్దూ ఎస్జీటీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లభించలేదు. దీంతో ఐదు పోస్టులను పెండింగ్‌లో ఉంచారు. మిగిలిన పోస్టుల్లో కేటగిరీల వారీగా జడ్పీ, మునిసిపల్, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో ఎస్జీటీలు 239, స్కూల్ అసిస్టెంట్, తత్సమాన వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు 495, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఎస్జీటీలు 335, స్కూల్ అసిస్టెంట్ 65 పోస్టులకు మెరిట్ జాబితా మేరకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేశారు. మొత్తం 1,134 మంది అభ్యర్థుల వివరాలతో కూడిన జాబితాపై అభ్యంతరాలు తెలుసుకునేందు కు వీలుగా రెండు రోజుల కిందటే జాబితాను జిల్లాకు పంపారు. జాబితాను పరిశీలించిన విద్యా శాఖ తిరిగి పాఠశాల విద్యాశాఖకు పంపింది.

19న నియామక పత్రాలు

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19వ తేదీన రాజధాని అమరావతిలో నియామకపత్రాలు అందజేస్తారు. 22వ తేదీ నుంచి వారందరికీ జిల్లాలో రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం 80 మంది టీచర్లను రిసోర్స్ పర్సన్లుగా ఎంపికచేశారు. ఎస్జీటీలు, సబ్జెక్టు వారీగా స్కూల్ అసిస్టెంట్లకు వేర్వేరుగా శిక్షణ అందిస్తారు. అయితే మొత్తం 1,134 మందికి ఒకేచోట శిక్షణ ఇచ్చేందుకు అనువుగా ఉండే వేదికను ఎంపిక చేసేందుకు విద్యా శాఖ కసరత్తు చేస్తున్నది. దీంతో పాటు సబ్జెక్టు టీచర్లకు మూడు జిల్లాల్లో వేర్వేరుగా శిక్షణ ఇచ్చే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నామని విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ప్రయాణ సమయం మార్చుకోండి

- ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు పిలుపు

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):
ఆర్టీసీ ప్రయాణికులు తమ ప్రయాణ సమయాల్లో మార్పు చేసుకోవాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు కోరారు. స్త్రీశక్తి పథకంతో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోందని, దీంతో ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవడం లేదన్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని 175 అదనపు బస్సుల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఈ నేపథ్యంలో సాధారణ ప్రయాణికులు, మహిళలు ప్రయాణ సమయాల్లో మార్పులు చేసుకోవాలన్నారు. ఉదయం 7 నుంచి 10 గంటలవరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు విద్యార్థులు, కార్మికులు, సాధారణ ప్రయాణికుల రద్దీ ఉంటుందని, దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీనిని అధిగమించేందుకు సాధారణ ప్రయాణికులు, మహిళలు తమ ప్రయాణ సమయాన్ని ఉదయం 10 నుంచి సాయంత్రం 4, రాత్రి 7 నుంచి 10 గంటల మధ్య మార్చుకుంటే అందరూ సాఫీగా ప్రయాణించే అవకాశం ఉంటుందన్నారు.

లెక్క తేల్చండి!



ఇళ్ల నిర్మాణాల ఇసుకపై ఆడిట్

- అధికారులను ఆదేశించిన కలెక్టర్
- లేఅవుట్‌లలో అక్రమాలపై ఫిర్యాదులు
- యథేచ్ఛగా అమ్ముకుంటున్నారనే ఆరోపణలు

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి)
సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు వినియోగించే ఇసుకపై ఆడిట్‌కు జిల్లా యంత్రాంగం రంగం సిద్ధం చేస్తోంది. శ్రీకాకుళం, రాజమండ్రి నుంచి సరఫరా చేసిన ఇసుకలో ఇప్పటివరకు ఎంత వినియోగించారు? ఇంకా లేఅవుట్‌లలో ఎంత నిల్వ ఉందనేది తేల్చేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. హౌసింగ్ అధికారుల సిఫారసుతో అవసరాలకు మించి ఇసుక తెప్పించారు. ఇదే సమయంలో లేఅవుట్‌ల నుంచి దారి మళ్లించారనే ఫిర్యాదులున్నాయి. సరఫరా, వినియోగం మధ్య భారీ తేడా ఉందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఇసుక వినియోగంపై లెక్కలు తేల్చాలని హౌసింగ్/గనులశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

నగర శివారు ప్రాంతాల్లోని 65 లేఅవుట్‌లలో సెంటు స్థలాల్లో సుమారు లక్ష ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి మూడేళ్లు కావస్తోంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి 20 టన్నుల ఇసుక ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తోంది. ఇప్పటి వరకు అన్ని లేఅవుట్‌లలో సుమారు 80వేల ఇళ్ల పనులు ప్రారంభించగా వాటిలో 25 వేల నిర్మాణాలు పూర్తిచేయగా మిగిలిన వివిధ దశల్లో ఉన్నాయి. శ్రీకాకుళం, రాజమండ్రి రీచ్‌ల నుంచి ప్రతిరోజూ పదుల లారీలతో ఇసుక సరఫరా జరుగుతోంది. వంశధార, నాగావళి, గోదావరి నదుల్లో గుర్తించిన రీచ్‌ల నుంచి ఇసుక తరలింపునకు గనుల శాఖ ఎప్పటికప్పుడు పర్మిట్లు జారీచేస్తుంటుంది. దీని ప్రకారం ఇంత వరకు 2.25 లక్షల టన్నుల ఇసుక సరఫరా జరిగింది. దీంట్లో 1.75 లక్షల టన్నుల ఇసుకను వినియోగించగా మిగిలింది ఆయా లేఅవుట్‌లలో ఉన్నట్టు అధికారులు నివేదికల్లో చూపిస్తున్నారు.

ఆది నుంచీ ఆరోపణలు

ఇసుక వినియోగంపై మొదటి నుంచి అనేక ఆరోపణలున్నాయి. లే అవుట్‌లకు వచ్చిన ఇసుకను హౌసింగ్‌లో కిందిస్థాయి సిబ్బంది, కాంట్రాక్టరుకు చెందిన మనుషులు, ఇసుక రవాణా చేసే డ్రైవర్ల మధ్య అనధికార ఒప్పందం ఉందనే ఫిర్యాదులున్నాయి. లేఅవుట్‌ల నుంచి సమీప గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఇసుక ... మిగతా 6వ పేజీలో

నగరంలో ఏఐ టీఎంఎస్

రూ.250 కోట్ల నుంచి రూ.500 కోట్లు ఖర్చవుతుందని అంచనా

- కేంద్రం నుంచి నిధుల సమీకరణకు ప్రతిపాదన
- పైలట్ ప్రాజెక్టు కింద ఐదు చోట్ల గత నెల 10, 11 తేదీల్లో డెమో
- ఎఫ్ఆర్ఎస్ ద్వారా అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపు
- 14,149 ఉల్లంఘనలు నమోదు
- డీపీఆర్ సమర్పించిన నాలుగు సంస్థలు
- త్వరలో ఆర్ఎఫ్‌పీ పిలిచేందుకు అధికారుల కసరత్తు



సిగ్నల్ జంపింగ్‌ను రికార్డు చేసిన దృశ్యం



సీటు బెల్ట్‌ను ధరించకుండా కారు నడుపుతున్న వైనం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)
నగరంలో రోడ్డు ప్రమాదాలకు అడుకట్టవేయడంతోపాటు నేరాల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏఐటీఎంఎస్) అమలుకు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి కార్యాచరణ ప్రారంభించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిని సీసీ కెమెరాల ద్వారానే గుర్తించి, చాలాన్ పంపంతోపాటు, నేరాల్లో నిందితులుగా ఉన్నవారు రోడ్లపై కనిపిస్తే ఆ వివరాలు సమీపంలోని పోలీసులు చేరేలా దీనిని రూపొందించారు. దీనివల్ల నేరాల సంఖ్య కూడా తగ్గుముఖంపడుతుందని అంచనా వేస్తున్నారు. పైలట్‌ప్రాజెక్టు కింద నగరంలో ఐదు చోట్ల గతనెల పది, 11 తేదీల్లో నిర్వహించిన డెమోలో సత్ఫలితాలు వచ్చాయి.

గతనెల పది, 11 తేదీల్లో (ఉదయం పది నుంచి రాత్రి పది గంటలు వరకు) పైలట్‌ప్రాజెక్టు కింద ఐదు చోట్ల అమలుచేసిన డెమోలో గుర్తించిన ఉల్లంఘనలు	
ఎయిర్‌పోర్టు జంక్షన్ నోహెల్మెట్	3,672
ట్రిపుల్‌రైడింగ్	294
సంగం శరత్ జంక్షన్ రాంగ్‌వే డ్రైవింగ్	2,101
రాంగ్‌పార్కింగ్	783
ఊర్వశిజంక్షన్ సీట్‌బెల్ట్ పెట్టకుండా డ్రైవింగ్	2,631
రెడ్‌లైట్ వయొలేషన్	1,256
రైల్వేస్టేషన్ డీఎల్‌ఓ జంక్షన్ ఓవర్‌స్పీడ్	3,412
ద్వారకాబస్‌స్టేషన్ ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపు	
మొత్తం గుర్తించిన ఉల్లంఘనలు	14,149

నగరంలో ఏటా రెండువేల వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిలో సుమారు 400 మంది ప్రాణాలు కోల్పోతుండగా, మరో 1,600 మంది క్షతగాత్రులవుతున్నారు. వాహనాల సంఖ్యతో పాటు రోడ్డుప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ట్రిపుల్‌రైడింగ్, బైక్‌లతో జిగ్‌జాగ్‌లు, రాంగ్‌రూట్‌లో నడపడం, రేసింగ్‌లకు పాల్పడుతున్నారు. మరికొందరు మద్యంసేవించి వాహనాలను నడుతున్నారు. కారు నడిపేవారు సీటుబెల్ట్ ధరించడం లేదు. పోలీసులు ఉంటేనే నిబంధనలు పాటించడం, లేదంటే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల నగరంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సీపీ శంఖబ్రతబాగ్చి ట్రాఫిక్ నిర్వహణకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించేందుకు సిద్ధమయ్యారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమలుచేయాలని భావించారు. దీనివల్ల హెల్మెట్‌లేకుండా వాహనం నడిపినా, సిగ్నల్ జంప్, ట్రిపుల్ రైడింగ్‌చేసినా, రాంగ్‌రూట్ ... మిగతా 6వ పేజీలో

కాంట్రాక్టర్‌కు నోటీసులు

రూ.36 లక్షలు చెల్లించాలని ఆదేశం

- గాజువాక మార్కెట్ ఆశీలు వ్యవహారంపై జీవీఎంసీ చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):
గాజువాక మార్కెట్‌లో ఆశీలు వసూలు చేస్తున్న కాంట్రాక్టర్‌కు జోన్-6 రెవెన్యూ అధికారులు నోటీసు జారీచేశారు. జూలైలో కట్టాల్సిన సుమారు రూ.36 లక్షలు తక్షణం చెల్లించాలని ఆదేశించారు. లేదంటే సెక్యూరిటీ డిపాజిట్ (ఈఎండీ) రూ.45 లక్షలను జమ చేసుకుని, టెండర్ రద్దుచేస్తామని స్పష్టం చేశారు.

గాజువాక మార్కెట్‌లో దుకాణాలు, రోడ్డుమార్జిన్‌లు, మార్కెట్‌కు లోడుతో వచ్చే వాహనాల నుంచి ఆశీలు వసూలు చేసేందుకు జీవీఎంసీ ఈ ఏడాది మార్చిలో వేలం నిర్వహించగా ఓ కాంట్రాక్టర్ రూ.2.2 కోట్లకు దక్కించుకున్నారు. దీనికి స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకపోవడంతో జూన్ నెలాఖరు వరకు జోన్-6 రెవెన్యూ అధికారులే ఆశీలు వసూలు చేయాలి. కానీ కాంట్రాక్టర్ తానే ఆశీలు వసూలుచేశారు. స్టాండింగ్ కమిటీ ఆమోదం కోసం ఈ అంశాన్ని జూన్‌లో పొందుపరిచారు. అయితే ఏప్రిల్ ఒకటి నుంచి కాంట్రాక్టరు ఆశీలు వసూలుచేస్తున్నందున వేలంలో పాడిన రూ.2.2 కోట్లు జీవీఎంసీకి చెల్లించేలా సమ్మతి పత్రాన్ని తీసుకోవాలని, లేదంటే ఈఎండీని జమ చేసుకుని తిరిగి వేలం నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు ... మిగతా 6వ పేజీలో

తీరంలో ఘోరం

రుషికొండ వద్ద సంద్రంలో ఇద్దరు విద్యార్థులు గల్లంతు

- ప్రమాదం నుంచి బయటపడిన మరో ఇద్దరు



గల్లంతైన మండల సంజయ్ (ఫైల్ ఫొటో)



మామిడిశెట్టి శ్యామన్ సాయి (ఫైల్ ఫొటో)



ప్రమాదం నుంచి బయటపడిన విద్యార్థులతో పోలీసులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):
రుషికొండబీచ్‌కు కొద్ది దూరంలో సముద్రస్నానాలకు దిగిన ఇద్దరు విద్యార్థులు కెరటాల ఉధృతికి గల్లంతయ్యారు. మరో ఇద్దరు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి...

పోతినమల్లయ్యపాలెం సాంకేతిక కళాశాల ప్రాంతంలో నివాసం ఉంటున్న నలుగురు విద్యార్థులు ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో రుషికొండ బీచ్‌కు వచ్చారు. అక్కడ కాసేపు సరదాగా గడిపి సముద్ర స్నానాలకు ఉపక్రమించారు. అయితే పోలీసులు, లైఫ్‌గార్డులు అలర్ట్ చేయడం, హెచ్చరికలు జారీ చేస్తుండడంతో అక్కడికి కాస్త దూరంలో స్నానానికి ఉపక్రమించారు. సముద్రంలో దిగి స్నానం చేస్తుండగా ఒక్కసారిగా ఎగసిపడిన అలల తాకిడికి చెల్లాచెదురయ్యారు. వీరిలో చంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మామిడిశెట్టి శ్యామన్‌సాయి (14), శ్రీకృష్ణ స్కూల్‌లో పది విద్యార్థి మండల సంజయ్ (15) కెరటాల తాకిడికి గల్లంతయ్యారు. బోయపాలెం ఈస్ట్రన్ విశాఖ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ముకల సాగర్ (15), ఎంవీపీ శ్రీచైతన్య స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న తెన్ను బాలాదిత్య (15) సురక్షితంగా బయటపడ్డారు. కాగా గల్లంతైన వారి కోసం లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు గాలిస్తున్నారు. వారి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీరానికి చేరుకుని, కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

లారీల్లో రా మెటీరియల్ తరలింపు

- ఉక్కు అధికారుల వింత పోకడ

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):
విశాఖ స్టీల్‌ప్లాంటులో రా మెటీరియల్‌ను లారీలో తరలిస్తున్నట్టు సమాచారం. సాధారణంగా రైల్వే వ్యాగన్లు, గంగవరం పోర్టు నుంచి కన్వేయర్ బెల్ట్ ద్వారా ఆర్ఎంహెచ్‌పీ (రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్) విభాగానికి చేరుతుంది. అక్కడి నుంచి ఆయా విభాగాలకు కన్వేయర్ బెల్టు ద్వారానే పంపుతారు. ఇటీవల కన్వేయర్‌లు సరిగా పనిచేయకపోవడంతో ఆర్ఎంహెచ్‌పీ విభాగం నుంచి మెటీరియల్‌ను లారీల్లో తరలిస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం భారీ లారీలను వినియోగిస్తున్నారని, ఆయా మార్గాల్లో ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారని చెబుతున్నారు. లారీల్లో రా మెటీరియల్ తరలింపు భారీ ఖర్చుతో కూడుకున్నదని, సమయానికి కూడా అందదని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు.

ఆగమ పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

- వారం రోజుల క్రితం ఘటన
- నాటి నుంచే పాఠశాలకు సెలవులు

సింహాచలం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆగమ పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారం రోజుల క్రితం గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా విద్యార్థులు బయట కేటరింగ్ నుంచి రాత్రి భోజనం తెప్పించుకున్నారు. అది తిని అస్వస్థతకు గురైనట్టు తెలిసింది. బాధితులకు స్థానిక గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేశారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో అపోలో ఆస్పత్రిలో చేర్చారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారం రోజుల క్రితమే పాఠశాలకు సెలవులు ఇచ్చి,మూసివేశారు. ఈ విషయమై పాఠశాల పర్యవేక్షణాధికారిని వివరణ కోరగా విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు వచ్చిన మాట వాస్తవమేనని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారం రోజుల క్రితమే పాఠశాలకు దసరా సెలవులు ప్రకటించినట్టు చెప్పారు.

ముగిసిన మూట్ కోర్టు పోటీలు

మధురవాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్‌వీపీ లా కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అళ్వార్‌దాస్ నేషనల్ మూట్ కోర్ట్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. దేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన 30 లా కళాశాలలు, యూనివర్సిటీల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. బెంగళూరుకు చెందిన బీఎం ఎస్ కాలేజీ విద్యార్థులు మొదటి బహుమతి పొంది రూ. 40 వేలు నగదు పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఐసీఎఫ్ఏఐ లా యూనివర్సిటీ విద్యార్థులు ద్వితీయ స్థానం పొందారు. వారికి రూ. 25 వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ జనరల్ డాక్టర్ వి.కృష్ణమోహన్, ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు గంటా రామారావు, సీనియర్ న్యాయవాది వి. రవీంద్రప్రసాద్, ఎన్‌వీపీ లా కళాశాల కరస్పాండెంట్ సుంకరి రవీంద్ర, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్, ఏయూ బీఆర్ అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ సీతామాణిక్యం, ఎన్‌వీపీ లా కళాశాల ప్రిన్సిపాల్ అలక్ చంద్రుడు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో మహిళలకు ఆత్మరక్షణ

మధురవాడ, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : మార్షల్ ఆర్ట్స్ మహిళలకు ఆత్మరక్షణగా ఉపయోగపడుతుందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్ శిల్పారామంలో రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ఆదివారంతో ముగిసాయి. సీపీ విజేతలకు మెడల్స్ అందించారు.

భద్రయ్యపేటలో ఆర్ఓ ప్లాంట్

- కిడ్నీ వ్యాధి నేపథ్యంలో రోటరీ క్లబ్ ఏర్పాటు
- ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



ఆర్ఓ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పద్మనాభం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంటును ప్రజలు సద్వినియోగం చేసుకొని సురక్షితమైన తాగునీటిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. 'మంచం పట్టిన భద్రయ్యపేట' అన్న శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు ఆయన స్పందించి అప్పట్లో గ్రామాన్ని సందర్శించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిమేరకు రోటరీ క్లబ్ గ్రామంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. ఈమేరకు ఆ సంస్థ నెలకొల్పిన ప్లాంటును గంటా ఆదివారం ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో సరైన తాగునీటి సౌకర్యం లేక ప్రజలు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని పత్రిక ద్వారా తెలుసుకున్నామన్నారు. గ్రామాన్ని సందర్శించి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడానికి వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాల్సిందిగా రోటరీ క్లబ్ ప్రతినిధులను అడిగిన వెంటనే వారు ముందుకు వచ్చి ప్లాంటును ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు ప్లాంటును జాగ్రత్తగా నిర్వహించుకొని వినియోగించుకోవాలని చెప్పారు.రోటరీ క్లబ్ తమ సేవలను నియోజకవర్గంలోని మిగతా గ్రామాలకు కూడా విస్తరించాలని కోరారు. అనంతరం పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ రీజనల్ మేనేజరు శోభన్ ప్రకాశ్, అధ్యక్షుడు కె. రాంప్రసాద్, భీమిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు కె. రామస్వామినాయుడు, పి. జగన్నాథం, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టరు లీలావతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, ఎంపీడీఓ విజయకుమార్, టీడీపీ నాయకులు దామోదరరావు, రమణ, నగేశ్‌కుమార్, లక్ష్మి, పావని, నందిని, ప్రసాద్, ఎర్నాయుడు, మూర్తి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జిలు శ్రీరాములు, అప్పలనాయుడు, శ్రీనివాసరావు, కృష్ణమూర్తిరాజు పాల్గొన్నారు.

లెక్క తేల్చండి!

... 5వ పేజీ తరువాయి

విక్రయిస్తున్నారు. సమీపంలోని లేఅవుట్ నుంచి టన్ను రూ.400కు ఆనందపురం మండలం గండిగుండం, రామవరం, భీమన్నదొరపాలెం గ్రామాలకు చెందిన పలువురు కొనుగోలుచేశారు. దీంతో పాటు ఇనుము, సిమెంట్ కొనుగోలుచేయడం బహిరంగ రహస్యం. ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి, సబ్బవరం మండలాల్లో లేఅవుట్ల నుంచి సమీప గ్రామాలకు ఇసుక పబ్లిక్‌గా తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇంకా ప్రతి ఇంటికీ 20 టన్నుల ఇసుక వినియోగించాల్సి ఉన్నా అంత కంటే తక్కువగా వాడుతున్నారు. రూ.1.8 లక్షలతో చేపట్టిన ఇంటి నిర్మాణాలకు, రూ.2.15 లక్షలతో నిర్మించే ఇళ్లకు మధ్య ఇసుక వినియోగంలో తేడా ఉంది. అయినా రెండింటికి ఒకే విధంగా ఇసుక అవసరమని అధికారులు గనులశాఖకు ఇన్‌వాయిస్‌లు జనరేట్ చేస్తున్నారు. కొందరు ఏఈల చేతివాటం హౌసింగ్ సంస్థకు తలనొప్పిగా మారింది. ఇదిలా వుండగా ఉమ్మడి జిల్లాలో నదుల నుంచి తవ్విన ఇసుకను రాజమండ్రి నుంచి తెస్తున్నామని ఒక ట్రాన్స్‌పోర్టర్ తప్పుడు రవాణా బిల్లులు పెట్టారనే ఆరోపణలున్నాయి. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్, ఇసుక సరఫరా, వినియోగంపై పూర్తిస్థాయిలో లెక్కలు తేల్చడానికి వీలుగా ఆడిట్ చేయాలని ఆదేశించారు. త్వరలో గనులుశాఖ, హౌసింగ్ సంస్థ సంయుక్తంగా ఇసుక వినియోగంపై లెక్కలు తేల్చనున్నాయి.

ఉత్సవాలకు పందిరి రాట

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట వేశారు. సుత్తమ్మతల్లి దేవాలయ కమిటీ, భవానీ పీఠం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉత్సవంలో భాగంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరణ చేస్తామని చెప్పారు.

భీమునిపట్నం : పాత బస్టాండ్‌లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట వేశారు. నూకాంబికా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, 4వ వార్డు అధ్యక్షుడు పాసి నరసింగరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

నగరంలో ఏఐ టీఎంఎస్

... 5వ పేజీ తరువాయి

నోపార్కింగ్‌జోన్‌లో పార్కింగ్, సీటుబెల్ట్ ధరించకపోయినా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపినా కెమెరాలు గుర్తించి, ఫొటోలు, వీడియోలను తీసి, నంబర్‌ప్లేట్ ఆధారంగా జరిమానా లెక్కించి వాహనం యజమాని ఈ-చాలాన్ పంపుతుంది. నగరంలో చోరీలు, స్నాచింగ్‌లు, దోపిడీలు, హత్యలు, దాడులు, ఈవ్‌టీజింగ్‌లకు అడ్డుకట్టవేయడం ద్వారా క్రైమ్ రేట్‌ను తగ్గించేందుకు ఏఐటీఎంఎస్ ఉపయోగపడుతుందని సీపీ భావిస్తున్నారు. నేరస్తుల ఫొటోలు, ఇతర వివరాలతోపాటు స్టేట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, నేషనల్‌క్రైమ్ రికార్డ్స్ బ్యూరోలోని డేటాను ప్రాజెక్టుకు అనుసంధానిస్తే వారు కనిపించగానే ఫేషియల్ రికగ్నైజేషన్ ద్వారా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం చేరుతుంది. దీనివల్ల ఏదైనా నేరం జరిగితే నిందితులను పట్టుకోవడంతోపాటు పాతనేరస్తులను, దాగివున్న వారిని సులభంగా పట్టుకునేందుకు వీలుంటుంది.

భారీగానే వ్యయం

ఏఐటీఎంఎస్ ప్రాజెక్టు అమలుకు కనీసం రూ. 250 కోట్ల నుంచి రూ.500 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. అంత మొత్తాన్ని పోలీస్, జీవీఎంసీ భరించే పరిస్థితి లేదు. దీంతో కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌తో పాటు ఎంపీ శ్రీభరత్‌తో చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరిస్తే ప్రాజెక్టును మూడుదశలుగా చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేశారు. దీనికి ఆమోదం లభిస్తే దేశంలోనే ఈ విధానం అమలుచేసిన మొదటి నగరంగా విశాఖకు గుర్తింపు దక్కుతుంది.

ఐదు జంక్షన్లలో డెమో

ప్రాజెక్టును అమలుచేయడానికి ముందు ఐదు సంస్థలతో పైలట్ ప్రాజెక్టుగా నగరంలోని ఐదు జంక్షన్లలో గతనెల పది, 11 తేదీల్లో ఉదయం పది నుంచి రాత్రి పది గంటల వరకు డెమో నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల గుర్తింపు, వివరాలు సేకరించారు. ఎయిర్‌పోర్టు జంక్షన్ వద్ద హెల్మెట్‌లేకుండా వాహనం నడుపుతున్న 3,672 మంది ఫొటోలు, వీడియోలు తీసింది. 294 ట్రిపుల్‌రైడింగ్ వాహనాలను గుర్తించింది. సంగం శరత్ జంక్షన్‌లో రాంగ్‌రూట్‌లో వెళుతున్న 2,101వాహనాలను, నోపార్కింగ్ జోన్‌లో పార్క్ చేసిన 783 వాహనాలను గుర్తించింది. ఊర్వశిజంక్షన్ వద్ద సీట్‌బెల్ట్ పెట్టకుండా కారు డ్రైవింగ్ చేస్తున్న 2,631 మందితో పాటు 1,256 సిగ్నల్ జంపింగ్ వాహనాలను గుర్తించింది. రైల్వేస్టేషన్ డీ ఎల్ఓ జంక్షన్ వద్ద డెమోలో భాగంగా 35 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని నిర్ణయించగా అంతకంటే ఎక్కువ వేగంతో వెళుతున్న 3,412 వాహనాలను గుర్తించింది. ద్వారకాబస్‌స్టేషన్‌లో అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని టూటౌన్ పోలీసులకు పంపింది. దీంతో నాలుగు సంస్థలు సీపీకి డీపీఆర్‌ను అందజేశాయి.

త్వరలోనే ఆర్‌ఎఫ్‌పీ పిలుస్తాం

ఏఐ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు డెమో విజయవంతమయింది. నాలుగు సంస్థలు డీపీఆర్ అందజేశాయి. త్వరలో ఆర్‌ఎఫ్‌పీ పిలుస్తాం. నిధులను సమకూర్చుకునే అంశంపై ఆలోచిస్తున్నాం. కేంద్ర సహకారం కోసం ఎంపీ శ్రీభరత్ సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే నగరంలో రోడ్డుప్రమాదాలు, నేరాల సంఖ్య తగ్గుతుంది. - శంఖబ్రత బాగ్చి, సీపీ

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



హిందీ ఉపాధ్యాయుడ్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం ఆది వారం ఘనంగా జరిగింది. పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు టీఎస్‌వీ ప్రసాదరావును గ్రామస్తులు, విద్యా కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ సంద ర్భంగా విద్యా కమిటీ ఛైర్మన్ బి. సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రసాదరావు హిందీ భాషాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, గత కొన్నేళ్లుగా దక్షిణ భారత హిందీ ప్రచార సభ ద్వారా ఎంతోమంది విద్యార్థులను వివిధ పరీక్షలకు పంపించి, వారి ఉత్తీర్ణతకు కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు పి. మురళి, ఇజ్జాడ రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సుజాత, చంద్ర, లక్ష్మి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే చిట్టివలస సంతపేట అంబేడ్కర్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయిని మహాలక్ష్మిని సాయి సంహిత ఫౌండేషన్ సభ్యులు పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు హిందీ బోధిస్తున్న మహాలక్ష్మి ప్రాథమిక, మాధ్య మిక వంటి హిందీ పరీక్షలకు వెళుతున్న విద్యార్థులకు ఉచి తంగా శిక్షణ అందిస్తున్నారని ఆ సంస్థ అధ్యక్షుడు ఆర్. అప్పలరాజు తెలిపారు.

భీమిలి బీచ్ కిటకిట



భీమునిపట్నం/సాగర్‌నగర్ : భీమిలి, రుషికొండ బీచ్‌లు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి.నగరంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇసుక తిన్నెల్లో ఆటలు ఆడుతూ.. సముద్రంలో స్నానాలు చేస్తూ సందడిగా గడిపారు.

త్వరలో అందుబాటులోకి 'సుజల స్రవంతి'

సింహాచలం,సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు ప్రజలకు త్వరలోనే ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా తాగునీరు అందించనున్నట్టు జోన్-8 కమిషనర్ శంకరరావు తెలిపారు. ఆదివారం ఆయన కార్పొరేటర్ నరసింహంతో కలిసి ఎన్టీఆర్ సుజల స్రవంతి భవనాన్ని పరిశీలించారు. నీటి సరఫరా, పథకానికి వినియోగించిన యంత్రాల స్థితిగతులపై ఆరా తీశారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. కానీ జోన్-6 రెవెన్యూ అధికారులు కాంట్రాక్టర్ మార్చి నుంచి మే వరకు వసూలు చేసిన ఆశీలు మొత్తాన్ని జీవీఎంసీకి చెల్లించి, మిగిలిన తొమ్మిది నెలలకు వేలం మొత్తాన్ని లెక్కించి వసూలు చేసేలా స్టాండింగ్ కమిటీ తీర్మానం చేసినట్టు మినిట్స్‌లో నమోదు చేయించారు. దీనిపై ఈనెల 11న 'గాజువాక మార్కెట్‌లో మాయగాళ్లు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన జోన్-6 రెవెన్యూ అధికారులు మార్కెట్ ఆశీలు కాంట్రాక్టర్‌కు నోటీసు జారీచేశారు.

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ఎండాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గొల్లల ఎండాడలోని సీఎంఆర్ మండల ప్రజా పరిషత్ పాఠశాల ఆవరణలో ఎండాడ లయన్స్ క్లబ్, విశాఖ ఐ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 150 మంది రోగులను వైద్యులు పరీక్షించారు.

రాష్ట్రంలోని ప్రతి గడపకు పార్టీని తీసుకెళ్లాలి

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం సాయంత్రం హోటల్ గ్రాండ్ బేలో పార్టీ పదాధికారులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ పార్టీని చేరువ చేయాలని, ఆ దిశగా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. అవసరమైతే పార్టీలో చేరికలను ప్రోత్సహించాలని సూచించారు. పార్టీ పట్ల ఆసక్తి ఉన్న వారిని ఆహ్వానించాలన్నారు. అదే సమయంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని చెప్పారు. నాయకులు బేధాభిప్రాయాలను పక్కన పెట్టి పార్టీకి ప్రాధాన్యత ఇవ్వా లన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో జోష్

... 5వ పేజీ తరువాయి

మాట్లాడారు. దేశం, రాష్ట్రం అభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి కోసం తెచ్చిన పరిశ్రమలు, ప్రాజెక్టుల గురించి వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదని, ఇందుకు అవసరమైన నిధులను ఇస్తోందన్నారు. భవిష్యత్తులో మరింత చేయూత అందిస్తామని స్పష్టం చేశారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోయేందుకు మోదీ ఇతోధికంగా సాయపడుతున్నారన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునేం దుకు గతంలో వాజపేయి, ఇప్పుడు మోదీ సర్కారు అందించిన సహాయా న్ని ప్రజలు గుర్తించాలని కోరారు. సుమారు రూ.11,500 కోట్ల గ్రాంట్‌ను ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంటుకు అందించి ఆదుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా కంకణ బద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత బీజేపీ తీసుకుందన్నారు. అగ్ర నాయకుల ప్రసంగాలకు పార్టీ శ్రేణుల నుంచి మంచి స్పందన వచ్చింది. అంతకుముందు పార్టీ నాయకులకు శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఓపెన్ టాప్ వాహనంపై నడ్డా, మాధవ్ తదితర నేతలు ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్నారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను సందర్శించారు. అరకు కాఫీ, ఏటికొప్పాక బొమ్మలు, కొబ్బరి పీచుతో తయారు చేసిన వస్తువులు, పొందూరు ఖాదీ ఉత్పత్తులను పరిశీలించారు. నడ్డాతో పాటు ఇతర ప్రముఖులకు జీసీసీ అధికారులు బహుమతులను అందించారు. అనంతరం వేదికపైకి చేరుకున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్‌కు రాష్ట్ర నేతలు స్వాగతం పలికారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామ రాజు ఆధ్వర్యంలో జేపీ నడ్డా, మాధవ్‌లను గజమాలతో సత్కరించారు. అంతకుముందు సభా ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, విష్ణుకుమార్ రాజు, కామినేని శ్రీనివాస్, నడుకుదిటి ఈశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నియోజకవ ర్గాల ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

భారీగా హాజరైన శ్రేణులు..

సభకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే సభా ప్రాంగణానికి రావడం మొదలుపెట్టారు. 11 గంటలకు ముఖ్య నాయకులు వేదికపైకి వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ సాగింది. వర్షం వచ్చినా ఆటంకం లేకుండా భారీ రెయిన్ ప్రూఫ్ టెంట్లు వేశారు.

నేడు వైష్ణవ జన్మాష్టమి వేడుకలు

ఆరిలోవ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ భగవానుడి తిరు నక్షత్రం (కణ్ణన్ తిరు నక్షత్రం) శ్రీ వైష్ణవ జన్మాష్టమిని పురస్కరించుకొని జీవీఎంసీ 10వ వార్డులో గల రాజీవ్ నగర్‌లో వెలసిన లక్ష్మీనారాయణ ఆలయంలో సోమవారం సాయంత్రం శ్రీకృష్ణ భగవానుడికి అభిషేకం, అలంకరణ, అర్చన, మంగళశాసనం, తనియ విన్నపము. తీర్థ ప్రసాదాల గోష్ఠి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా మెహర్ బాబా కేంద్రం వార్షికోత్సవం

పద్మనాభం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవిడి గ్రామంలో అవతార్ మెహర్ బాబా కేంద్రం 17వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తన చేపట్టారు. అనంతరం జెడ్పీ పాఠశాల హెచ్ఎం వి. శంకరరావు సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు కొండలరావు, పావని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాబా చూపిన ప్రేమతత్వంతో ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలన్నారు. బాబా బోధలను వివరించారు. ఈ కార్యక్రమంలో రేవిడి కేంద్రం నిర్వాహకులు ఎం. సత్యబాపిరాజు, కమల్, సహవాస్, కార్యనిర్వాహకులు రామారావు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లోని 20 కేంద్రాల నుంచి బాబా ప్రేమికులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఆరిలోవ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవలోని సిద్ధార్థనగర్‌లో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ కృష్ణ, సిబ్బందితో కలిసి దాడి చేసి, పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1.52 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న పారా లీగల్ వలంటీర్ భవాని

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతు బజార్‌లో వివిధ ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ లభించే రుణాలపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా న్యాయ సలహా సర్వీస్ అథారిటీ న్యాయవాది, పారా లీగల్ వలంటీర్ భవానీ రైతులు, వినియోగదారులతో మాట్లాడారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయకులు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 28, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 38, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడుచిక్కుడు 76, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	132
లైవ్ ధర	152
విత్ స్కిన్	274
స్కిన్‌లెస్	284

రైతుబజార్‌లో నాణ్యత లేని సరుకులు

» నాసిరకం ఉల్లిపాయలు, పాడైన టమాటా విక్రయం » కొనుగోలుదారుల గగ్గోలు » పట్టించుకోని అధికారులు

పెదవాల్తేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుబజార్‌లో ఆదివారం రాయితీపై కిలో రూ.15కు విక్రయిస్తున్న రాయితీ ఉల్లిపాయలు నాసిరకంగా ఉన్నాయంటూ కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటల నుంచి రైతుబజార్‌లోని 4 డ్వాక్రా కౌంటర్ల ద్వారా మార్కెటింగ్ శాఖ అధికారులు ఉల్లి విక్రయాలు చేపట్టారు. అయితే ఈ ఉల్లిని కొనేందుకు వినియోగదారులు ఆసక్తి చూపలేదు. వీటిలో కుళ్లిపోయిన, మొలకెత్తిన ఉల్లి ఉండడంతో పాటు వాసన వస్తుండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు పెద్దగా ముందుకు రాలేదు.

రాయితీపై విక్రయించేందుకుఆదివారం కర్నూలు ఉల్లిపాయలు 40 బస్తాలు వచ్చాయి. ఒక బస్తాకు 45 కిలోలు చొప్పున మొత్తం 1800 కిలోల విక్రయం నిమిత్తం రైతుబజార్‌కు తీసుకువచ్చారు. ఈ ఉల్లిపాయలు నాసిరకంగా ఉండడంతో కొనడానికి ఆసక్తి చూపలేదు. బయట మార్కెట్‌లో కిలో రూ.36కు విక్రయిస్తున్నప్పటికీ వాటిని కొనేందుకు మొగ్గు చూపారు. తమకు కుళ్లి పాడైన, మొలకెత్తిన ఉల్లి వల్ల నష్టం చేకూరే అవకాశం ఉందని డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాయితీపై విక్రయించేందుకు వచ్చిన నాసిరకం ఉల్లి



పాడైపోయిన టమాటాలు

ఈ విషయమూ రైతుబజార్ ఈవో సత్యకళ వద్ద ప్రస్తావించగా.. రద్దు ఉల్లిపై అధికారులు మినహాయింపు ఇస్తున్నట్టు ఆమె తెలిపారు. అలాగే పెదవాల్తేర్ రైతుబజార్‌లో ఆదివారం కిలో టమాటా రూ 24 కు విక్రయాలు చేపట్టారు. అయితే టమాటా కూడా నాసిరకంగా, కుళ్లి పాడై ఉన్నాయని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్‌లో గ్రేడింగ్ చేసి విక్రయాలు చేస్తామని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారని, కానీ పెదవాల్తేర్ రైతుబజార్‌లో నాసిరకం ఉల్లిపాయలు, టమాటాలు విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదని కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్‌కు వచ్చి ఖాళీగా చేతులతో తిరిగి వెళ్లలేక నాణ్యత లేని కూరగాయలు కొనాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

మార్షల్ ఆర్ట్స్‌తో మనోవికాసం, శారీరక దారుఢ్యం

» లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్




విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మానసిక, శారీరక దారుఢ్యానికి మార్షల్ ఆర్ట్స్ ఉపయోగపడుతుందని లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ అన్నారు. శివాజీ పార్కులో ఆదివారం బోధిధర్మ యుద్ధ కళాక్షేత్రం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశిష్ట అతిథులుగా ఏసీపీ లక్ష్మణమూర్తి, బీవైకేకే వ్యవస్థాపకుడు దయామయ, కర్షక దేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆడారి కిషోర్‌కుమార్, హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

విశాఖలో కేటీఎం డ్యూక్ 160 బైక్ ఆవిష్కరణ



కేటీఎం డ్యూక్160 బైక్ ఆవిష్కరణలో వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిశోర్



డ్యూక్ 160 బైక్‌పై ప్రభుకిశోర్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేటీఎం కొత్తగా రూపొందించిన డ్యూక్ 160 బైక్‌ను కేటీఎం అథరైజ్డ్ డీలర్ వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ (విశాఖపట్నం) అందుబాటు లోకి తీసుకువచ్చింది. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికివరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ఇతర అతిథులు సౌత్ సేల్స్ సర్కిల్ హెడ్ వి. కార్తీక్, ఏపీ ఏరియా సేల్స్ మేనేజర్ పి. హరీశ్, వరుణ్ బజాజ్ సీఈఓ ఆడారి శ్రీనివాస్‌తో కలిసి కేటీఎం డ్యూక్ 160 బైక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభు కిశోర్ మాట్లాడుతూ ఇది కేవలం బైక్ లాంచ్ మాత్రమే కాదని, ప్యాషన్, పవర్, పెర్ఫార్మెన్స్‌ల పండుగ అని తెలిపారు. కొత్త బైక్‌ను ప్రత్యక్షంగా చూడడమే కాకుండా టెస్ట్ రైడ్ కూడా చేయవచ్చునని చెప్పారు. సౌత్ సేల్స్ సర్కిల్ హెడ్ వి. కార్తీక్ మాట్లాడుతూ కేటీఎం 160 బైక్ ప్రత్యేక స్టైల్‌ను సంతరించుకుందన్నారు. పవర్‌తో పాటు పూర్తిస్థాయి టెక్నాలజీ ఈ బైక్ సొంతమని తెలిపారు. అనంతరం కేటీఎం గ్లోబ్ బ్రాండ్ డిస్‌ప్లే విధానం, ఇతర అంశాలను బైక్ ఆవిష్కరణలో ప్రదర్శించిన తీరు వినియోగదారులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

» బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు



కార్యక్రమంలో సోము వీర్రాజు, రవీంద్ర, ప్లాటిపస్ ఫౌండేషన్, గ్రీన్ పోయేట్స్ గీతం విద్యార్థులు తదితరులు

పెదవాల్తేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణఅందరి బాధ్యత అని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. ఆదివారం లాసన్స్ బే కాలనీ బీచ్, పెదజాలారిపేట తీర ప్రాంతంలో ప్లాటిపస్ ఫౌండేషన్, గ్రీన్ పోయెట్స్, గీతం విద్యార్థులు ఆర్గనైజింగ్ బృంద సభ్యులు 42 మంది స్వచ్ఛంద సేవకుల సహకారంతో బీచ్ పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సోము వీర్రాజు, బీజేపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీర పరిశుభ్రత కార్యక్రమం ద్వారా 200 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం జరిగిందని, ఈ వ్యర్థాలన్నీ జాలరిపేట, ఎండాడ పక్కన ఉన్న కాలువ ద్వారా సముద్రంలో కలుస్తున్నాయి అన్నారు. ఈ కాలువలకు జాలీలు వేయకపోవడం వల్ల సముద్రంలో కలుస్తున్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్లాటిపస్ ఫౌండేషన్ ప్రతినిధులు సుభాశ్‌చంద్రన్, గ్రీన్ పోయెట్స్ సొసైటీ సభ్యులు సిద్ధార్థ్ పల్లా పాల్గొన్నారు.

భీమునిపట్నంలో..

భీమునిపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మిషన్ గ్రీన్ భీమిలి సభ్యులు అన్నారు. ఆదివారం వారు లక్ష్మీనరసింహస్వామి కొండపై డ్రోన్ సహాయంతో మూడు కోట్ల విత్తనాలను జల్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లుగా కొండవాలు ప్రదేశంలో విత్తన బంతులు జల్లుతున్నామని,ఈసారి డ్రోన్ సహాయంతో మూడు కోట్ల విత్తనాలు జల్లినట్టు తెలిపారు. అంతకముందు నేరేళ్లవలస కాలనీలో టీడీపీ యువనేత గంటా రవితేజ మిషన్ గ్రీన్ భీమిలి ప్రతినిధులు డాక్టర్ ముమ్మిడిశెట్టి ఆదిత్య, గుల్లల వెంకటేశ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడిశెట్టి సత్యానందరావు, మైలపల్లి షణ్ముఖరావు, మునునూరి సూర్య శ్రీనివాసరావు, కాళ్ల సన్నీ, విజ్జపు సత్యనారాయణ, కట్టమూరి అశోక్, మారోజు గోపి, పెంటపల్లి దేవానంద్ పాల్గొన్నారు.

'విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం'



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న గంటా రవితేజ

ఆనందపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ అన్నారు. ఆదివారం గిడిజాల సమీపంలో ఉన్న మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేజీబీవీ విద్యార్థినుల విహార యాత్ర, ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ లోనే మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి, పట్టుదలతో లక్ష్య సాధనకు శ్రమించాలని చెప్పారు. కేజీబీవీని దత్తత తీసుకుని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్‌ను అభినందించారు. ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ తమ సంస్థ పేద విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు. ఇకపై పాఠశాల నుంచి ఏటా ఉత్తమ ఫలితాలు సాధించిన బాలికలను తమ ఖర్చుతో ఉన్నత చదువులు చదివించనున్నట్టు ప్రకటించారు. అనంతరం మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యాలయం ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు టీఆర్‌బీ నాయుడు, పాండ్రంకి అప్పలరాజు, మరుపిళ్ల సాయి జ్ఞానేశ్వర్, కోరాడ వైకుంఠరావు,రౌతు నాగరాజు, కాకర సురేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. లావణ్య, ఏపీసీజే అసోసియేషన్ చైర్మన్ శివాజీ, వైస్ చైర్మన్ మంగపున్న పాల్గొన్నారు.

ఉత్సాహంగా నేవీ సన్నాహక మారథాన్

» పాల్గొన్న పలువురు క్రీడాకారులు
» విజేతలకు బహుమతుల ప్రదానం
» డిసెంబరు 14న 'వన్ రన్ - నేషన్ మారథాన్' నినాదంతో భారీ ఎత్తున కార్యక్రమం



సన్నాహక మారథన్‌లో పాల్గొన్న నేవీ సిబ్బంది, క్రీడాకారులు తదితరులు

రేడ్డు, సెప్టెంబర్ 14, (ఆంధ్రజ్యోతి) : విశాఖ సాగర తీరంలో 'వన్ రన్ - వన్ నేషన్' నినాదంతో డిసెంబర్ 14న నిర్వహించనున్న వైజాగ్ నేవీ మారథాన్-2025కు సంబంధించి ఆదివారం బీచ్‌రోడ్డులో సన్నాహక మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 42కె, 21కె 10కె, 5కె పరుగు పందాలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.పలువురుక్రీడాకారులు, ఔత్సాహికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కెప్టెన్ ఎం.డి. అనూప్‌రాజ్ మాట్లాడుతూ క్రీడలతో ఒత్తిడి దూరమై మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యం సొంతమవుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులు నిత్యం విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు తమకు ఆసక్తి ఉన్న క్రీడాంశంలో సాధన చేయాలని సూచించారు. జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ నిత్యం విధుల్లో సతమతమయ్యే ఉద్యోగులు తరచూ అనారోగ్యం బారిన పడుతుంటారని, అలాంటి వారు రోజూ క్రీడలు సాధన చేస్తే ఇబ్బందులు తొలగి, ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఏటా ఇలాంటి పోటీలు ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. నేటి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని వెల్లడించారు. అనంతరం పరుగు పందాల్లో గెలుపొందిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కెప్టెన్ వినోద్ తివారీ, డిప్యూటీ రేస్ డైరెక్టర్, లెఫ్టినెంట్ కమాండర్ మెగ్నాన్ష్ నాయుడు, రేస్ కో-ఆర్డినేటర్ జోన్- 3 కమిషనర్ శివప్రసాద్, నేవీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

110 మందికి ఉచిత వైద్యసేవలు



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆరిలోవ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల రామకృష్ణాపురంలో ఆదివారం జేడీఎస్ ఆస్పత్రి (గతంలో ఏఎంజీ ఆస్పత్రి)లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లాలూ సంతోష్ 110 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా సంఘం గ్రామ అధ్యక్షుడు వంకరబాబూరావు, కాకర గోవింద్, గాడి కృష్ణ, నల్లా సింహాచలం, ఆస్పత్రి సిబ్బంది అనిల్, రేవతి, ఆర్జీ నాయడు తదితరలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి యువకుడి మృతి



జగదీశ్ (ఫైల్)

ఆనందపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమగొట్టి పాలెం సమీపంలో ఆటో బోల్తా పడడంతో ఒక యువకుడు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. సీఐ చింత వాసునాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. భీమిలి మండలంలోని రాజలింగంపేటకు చెందిన బోర రామారావు కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో ఆనందపురంలోని గిరిజాల సమీపంలో ఉన్న ధార పైడితల్లమ్మ ఆలయానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆటో డ్రైవర్ వంశీ వాహ నాన్ని నిర్లక్ష్యంగా నడపడంతో వేమగొట్టిపాలెం సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో బోర జగదీశ్ (22) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా, బర్ల సాయి, పల్లా సాయికుమార్‌కు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి బోర రామారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో రైతు మృత్యువాత

» భూములకు నష్ట పరిహారంపై నిరసన శిబిరంలో కుప్పకూలిన బాధితుడు



చంద్రరావు (ఫైల్‌ఫొటో)

పెందుర్తిరూరల్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): తమకు భూములకు తగిన నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ తలపెట్టిన ఆందోళన శిబిరంలోనే ఓ బాధిత రైతు గుండెపోటులోనై దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన పెందుర్తి మండలం పొర్లుపాలెంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలివి.. అదనపు రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం రైల్వేశాఖ స్థానిక రైతుల నుంచి వ్యవసాయ భూములను సేకరిస్తోంది. ఈ స్థితిలో పరిహారం కోసం నిరసన చేపడుతున్నారు. ఈ క్రమంలోగ్రామానికి చెందిన రాపర్తి చంద్రరావు (61) శిబిరంలో ఆదివారం నినాదాలు చేస్తూ ఒక్కసారిగా గుండెపోటుకు లోనై అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఈ సంఘటనపై మాజీ ఉప సర్పంచి మండల రెవెన్యూ, పోలీసు, రైల్వే అధికారులకు సమాచారమందించారు. మృతుడు చంద్రరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

టార్గెట్‌బాల్ చాంపియన్ తూర్పు గోదావరి

» ద్వితీయ స్థానం నిలిచిన శ్రీకాకుళం జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన తూర్పు గోదావరి జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

ఆరిలోవ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సబ్ జూనియర్ బాల బాలికల టార్గెట్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీలో తూర్పు గోదావరి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం జిల్లా జట్టు నిలిచింది. అలాగే బాలికలమిక్స్ విభాగంలో కూడా తూర్పు గోదావరి జిల్లా జట్టు విజేతగా నిలవగా, రెండో స్థానంలో ప్రకాశం జిల్లా జట్టు నిలిచింది. ఈ పోటీలకు మొత్తం 9 జిల్లాల నుంచి 300 మంది క్రీడా కారులు పాల్గొన్నట్టు పోటీల నిర్వాహకుడు, జిల్లా కార్యదర్శి కె.ప్రేమసాయి వెల్లడించారు. విజేతలకు ఆంధ్రప్రదేశ్ టార్గెట్బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సురేష్ కుమార్, హ్యాండ్‌బాల్ జాతీయ క్రీడాకారలు పి.సత్యనారాయణ రాజు, సుధాకర్ మోహన్, ముఖ్య అతిథులుగా విచ్చేసిక్రీడాకారులకు బహుమతులను ప్రదానంశాఆరు.ఈ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడా కారులకు అక్టోబర్‌లో భోపాల్‌లో జరిగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్టు ప్రేమసాయి తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాపరుద్ర, ముస్తాఫా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆరిలోవ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చదువు వల్లే సమాజంలో హోదా, తద్వారా గుర్తింపు లభిస్తుందని, అందుకే ప్రతి విద్యార్థి కష్టపడి చదవడానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్‌రుద్ర పేర్కొన్నారు. ఆదివారం ఆరిలోవలో గల ముస్తాఫా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిలా దున్నబీ 1500 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 250 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఖలీషాను ప్రతాపరుద్ర అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, టీడీపీ 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎం.రాజారావు, టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, టీడీపీ సీనియర్ మహిళా నాయకురాలు రేఖాజ్యోతి పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట



హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో పందిరిరాట వేస్తున్న శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం ప్రతినిధులు, స్థానికులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాల సందర్భంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పలు సంఘాలు, యువకులు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో పందిరి రాటను వేశారు. జీవీఎంసీ 16వ వార్డు పాత వెంకోజీపాలెం శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లోని ఖాళీ స్థలంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల కోసం సంఘం కార్యవర్గ సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొని పూజలు నిర్వహించి పందిరి రాటను వేశారు. దసరాకు అమ్మవారిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహించి, నిమజ్జనం చేయనున్నట్టు సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులతో పాటు స్థానిక పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. అలాగే 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో ముహూర్తపు రాటను వేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు బోను సూరిబాబు, కర్రి గౌరీ తదితరులు పాల్గొన్నారు. కొత్త వెంకోజీపాలెం అంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న శ్రీవీరాంజనేయ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో దేవీనవరాత్రుల ఉత్సవాల కోసం పందిరి రాటను వేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు మళ్లరవి, అప్పలరాజు పాల్గొన్నారు.

దళిత బహుజనులు ఏకం కావాలి

» యూపీఎస్సీ పూర్వ సభ్యుడు, ద్రావిడ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ కేఎస్ చలం



సమావేశంలో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

సీతమ్మధార, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అనేక వర్గాలుగా విభజించబడిన దళిత బహుజనుల ఏకం కావాలని యూపీఎస్సీ పూర్వ సభ్యుడు, ద్రావిడ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ కేఎస్ చలం పిలుపునిచ్చారు. నగరంలోని ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం భీమ్‌సేన వార్ ఆధ్వర్యంలో మహా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చలం మాట్లాడుతూ దళిత బహుజనులంతా అనేక పార్టీల కింద విభజించబడి ఉన్నారని, వారంతా ఏకమై హక్కుల సాధన, రాజ్యాధికారం దిశగా పయనించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్, పెరియార్ రామస్వామి కలిసి దేశమంతా తిరిగి ఉద్యమాన్ని నిర్మించారని చెప్పారు. రిజర్వేషన్లు తొలిసారి తమిళనాడులో అమల్లోకి వచ్చాయని వాటికి ఆటంకం ఏర్పడితే 1951లో తొలి రాజ్యాంగ సవరణ జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో దుప్పల రవికుమార్, రాజేంద్రప్రసాద్, కె.చిన్నారావు, బల్లంకి కనకరాజు, మధు కుంచే, జి.రవికుమార్, కొల్లాబత్తుల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రగతిలో ఉపాధ్యాయులది పాత్ర కీలకం

» ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ బాలమోహన్‌దాస్



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న బాలమోహన్‌దాస్ తదితరులు

సీతమ్మధార, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి ప్రగతిలో ఉపాధ్యాయులది అత్యంత ముఖ్యమైన పాత్ర అని నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి వి.బాల మోహన్‌దాస్ పేర్కొన్నారు. బాల వికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ 2024-25 ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణ యూనివర్శిటీ మాజీ ఉపకులపతి ఎస్.రామకృష్ణారావు, సిక్కిం మాజీ డీజీపీ అత్తిలి సుధాకర్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా తిరుమల శ్రీదేవి, కుమారస్వామి, సుజాత, మోహనరావులను సత్కరించారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, కామేశ్వరి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కేరళీయుల ఓనం ముగింపు వేడుకలు



సీపీ శంకబ్రత బాగ్చీని సత్కరిస్తున్న కళాసమితి సభ్యులు

మురళీనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గంలోని మురళీనగర్ హైవేలోని కేరళ కళా సమితిలో ఆదివారం ఓనమ్ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. మలయాళీ సమాజం ఒక్క చోట చేరి సంప్రదాయ పండుగను వేడుకగా నిర్వహించుకున్నారు. కళా కేరళం ఆడిటోరియంలో సమితి ప్రధాన కార్యదర్శి కె.హరిదాస్ పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో నగరం నలుమూలల నుంచి కేరళీయులు హాజరై తమ సంప్రదాయ వస్త్రధారణ, నృత్య ప్రదర్శనలు, సహపంక్తి భోజనాలతో సందడి చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కేరళ కళా సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. వేడుకల్లో విశాఖ వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు తదితరులు హాజరయ్యారు.

ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ లీగ్ చాంప్ విశాఖ



క్రీడాకారులను అభినందిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ లీగ్ టోర్నీలో ఆతిధ్య విశాఖ ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్నది. ద్వితీయ స్థానంలో గుంటూరు, తృతీయ స్థానంలో శ్రీకాకుళం నిలిచాయి. ఏయూ ఇండోర్ హాలులో జరిగిన టోర్నీకి ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు పి.గణబాబు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధతతో సాధన చేసి ఉన్నత స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. క్రీడాకారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ద ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ మాట్లాడుతూ క్రీడా కేంద్రంగా రూపొందుతున్న విశాఖలో మరన్ని క్రీడా వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, త్వరలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర ప్రతినిధి ఆనందబాలు, కోచ్‌లు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ మీట్‌కు కోచ్‌గా శ్రీనివాసరావు



విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ జట్టుకు నగరానికి చెందిన కోచ్‌గా పిట్టా శ్రీనివాసరావు (రైల్వేస్) వ్యవహరించనున్నారని ఏపీ అథ్లెటిక్స్ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎం.నారాయణరావు తెలిపారు. అలాగే ఈ టోర్నీకి సీహెచ్ చరణ్, ఎస్.కృష్ణమూర్తి, డాక్టర్ ఎల్.ప్రవీణ్‌కుమార్ సాంకేతిక నిపుణులుగా నియమితులయ్యారని పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 25 వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనవర్సిటీలో జరగనున్న ఈ టోర్నీలో విశాఖ నుంచి బాలుర విభాగంలో షేక్ బషీర్, డి.బాలు, చింతల వినోద్, టి.గోపాలకృష్ణ, టి.చంద్రశేఖర్, డి.రహుల్ సాయికుమార్, డి.శేషు, కిరణ్‌సాయి, రెడ్డి శశాంక్, కె.సాయి కార్తికేయ, పి.రాజశేఖరరెడ్డి, వి.సంహాచలం, కెఆర్‌వీఎం.కుమార్ దొర, వి.శ్యాం భగవాన్, మద్ది వికాస్, గల్లెల రాంచరణ్, డి.రామ్ హితేష్...బాలికల విభాగంలో కెపిజి.కుమారి, ఎం.నాగసాయి వర్షిణి, పి.హాసిని, అయేష బాను, బి.శైలజ, పి.తిరీషా, కాంక్షశ్రీ, పి.తేజశ్వని, కె.రాగిణి, ఒమ్మి సిరిచందన, సిహెచ్.భార్గవి, సత్య సహస్రిక, ప్రవల్లిక రెడ్డి, ఎం.లక్ష్మి, ఎన్.బిందుహాసిని, బి.చైతన్య, బి.ఇషానా ప్రాతినిధ్యం వహించనున్నారన్నారు.

అభివృద్ధి పనులపై డీఆర్ఎం సమీక్ష

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డీఆర్ఎం లలిత్ బొహ్రా ఆదివారం వాల్తేరు డివిజన్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమావేశమై డివిజన్‌లో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి నిర్మాణ పనులు, అమృత భారత్ స్టేషన్ అభివృద్ధి పనులు తదితర అంశాలపై చర్చించారు. పునరుద్ధరించిన ఇంజనీరింగ్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేకే లైనులో బండరాళ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో చేపడుతున్న భద్రతా చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. అలాగే సంసిద్ధత విపత్తులు చర్యలు, భద్రతకు ఇస్తున్న ప్రాధాన్యత వంటి అంశాలను చర్చించారు. రైలు కార్యకలాపాలు సజావుగా సాగాలంటే నిరంతరం అప్రమత్తమంగా వ్యవహరించి భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమయపాలన పాటించి కలిసికట్టుగా పనిచేసి ప్రమాదాల నివారణతోపాటు డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు పునరుద్ధరించిన ఇంజనీరింగ్ సమావేశ హాలును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఈ.శాంతారామ్, సీనియర్ డీఈ మొహరానా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ వార్షికోత్సవం

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సేవల్లో ది శ్రీ గౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ ఎప్పుడూ ముందుంటుందని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబు అన్నారు. ఆ సంస్థ 28వ వార్షికోతవాన్ని ఆదివారం రైల్వే న్యూ కాలనీలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన గణబాబు మాట్లాడుతూ మంచి ఆర్గనైజేషన్లను ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. అలాంటి వాటిలో గౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ ముందు వరుసలో ఉంటుందని పేర్కొన్నారు. సొసైటీ చైర్మన్ చదరం డీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ తమ సొసైటీలో అతి వేగంగా రుణాలు మంజూరు చేస్తామని, సీనియర్ సిటిజన్లకు ఎక్కువ వడ్డీ అందిస్తున్నామని తెలిపారు. ఏటా మాదిరి ఈ ఏడాది కూడా సభ్యులకు 16 శాతం డివిడెండ్ అందజేస్తున్నామనారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ఆడారి నూకరాజు, కోశాధికారి ఆడారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులు నిత్యావసర సరుకుల పంపిణీ

మాధవధార, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) ; గ్రేటర్ 50వ వార్డులోని మాధవధార మానవసేవే మాధవసేవ అసోసియేషన్ అధ్వర్యంలో ఆదివారం 16 మంది కిడ్నీ రోగులకు నిత్యావసరాల పంపిణీ చేశారు. మురళీనగర్ వాకర్స్‌క్లబ్ వేదికగా చేపట్టి ఈ కార్యక్రమంలో సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.భానుప్రకాశ్, అధ్యక్షుడుఎస్.సీతారామకృష్ణ, ఉపాధ్యక్షులు కెవిఎస్.ప్రసాద్, పి.గిరిధర్, కార్యదర్శి త్రిమూర్తులు తదితరులు హాజరయ్యారు.

నగరంలో ఏఐ టీఎంఎస్

... 5వ పేజీ తరువాయి

నోపార్కిగ్‌జోన్‌లో పార్కింగ్, సీటుబెల్ట్ ధరించకపోయినా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపినా కెమెరాలు గుర్తించి, ఫొటోలు, వీడియోలను తీసి, నంబర్‌ప్లేట్ ఆధారంగా జరిమానా లెక్కించి వాహనం యజమాని ఈ-చాలాన్ పంపుతుంది.

నగరంలో చోరీలు, స్నాచింగ్‌లు, దోపిడీలు, హత్యలు, దాడులు, ఈవ్‌టీజింగ్‌లకు అడ్డుకట్టవేయడం ద్వారా క్రైమ్ రేట్‌ను తగ్గించేందుకు ఏఐటీఎంఎస్ ఉపయోగపడుతుందని సీపీ భావిస్తున్నారు. నేరస్తుల ఫొటోలు, ఇతర వివరాలతో పాటు స్టేట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, నేషనల్‌క్రైమ్ రికార్డ్స్ బ్యూరోలోని డేటాను ప్రాజెక్టుకు అనుసంధానిస్తే వారు కనిపించగానే ఫేషియల్ రికగ్నిజేషన్ ద్వారా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం చురుతుంది. దీనివల్ల ఏదైనా నేరం జరిగితే నిందితులను పట్టుకోవడంతోపాటు పాతనేరస్తులను, దాగివున్నవారిని సులభంగా పట్టుకునేందుకు వీలుంటుంది.

భారీగానే వ్యయం

ఏఐటీఎంఎస్ ప్రాజెక్టు అమలుకు కనీసం రూ.250 కోట్ల నుంచి రూ.500 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. అంతమొత్తాన్ని పోలీస్, జీవీఎంసీ భరించే పరిస్థితి లేదు. దీంతోకలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌తోపాటు ఎంపీ శ్రీభరత్‌తో చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరిస్తే ప్రాజెక్టును మూడుదశలుగా చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేశారు. దీనికి ఆమోదం లభిస్తే దేశంలోనే ఈ విధానం అమలుచేసిన మొదటి నగరంగా విశాఖకు గుర్తింపు దక్కుతుంది.

ఐదు జంక్షన్లలో డెమో

ప్రాజెక్టును అమలుచేయడానికి ముందు ఐదు సంస్థలతో పైలట్ ప్రాజెక్టుగా నగరంలోని ఐదు జంక్షన్లలో గతనెల పది, 11 తేదీల్లో ఉదయం పది నుంచి రాత్రి పది గంటల వరకు డెమో నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల గుర్తింపు, వివరాలు సేకరించారు. ఎయిర్‌పోర్టు జంక్షన్ వద్ద హెల్మెట్‌లేకుండా వాహనం నడుపుతున్న 3,672 మంది ఫొటోలు, వీడియోలు తీసింది. 294 ట్రిపుల్‌రైడింగ్ వాహనాలను గుర్తించింది. సంగం శరత్ జంక్షన్‌లో రాంగ్‌రూట్‌లో వెళుతున్న 2,101వాహనాలను, నోపార్కింగ్ జోన్‌లో పార్క్ చేసిన 783 వాహనాలను గుర్తించింది. ఊర్వశిజంక్షన్ వద్ద సీట్‌బెల్ట్ పెట్టకుండా కారు డ్రైవింగ్ చేస్తున్న 2,631 మందితో పాటు 1,256 సిగ్నల్ జంపింగ్ వాహనాలను గుర్తించింది. రైల్వేస్టేషన్ డీఎల్‌ఓ జంక్షన్ వద్ద డెమోలో భాగంగా 35 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని నిర్ణయించగా అంతకంటే ఎక్కువ వేగంతో వెళుతున్న 3,412 వాహనాలను గుర్తించింది. ద్వారకాబస్‌స్టేషన్‌లో అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని టూటౌన్ పోలీసులకు పంపింది. దీంతో నాలుగు సంస్థలు సీపీకి డీపీఆర్‌ను అందజేశాయి.

త్వరలోనే ఆర్‌ఎఫ్‌పీ పిలుస్తాం

ఏఐ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు డెమో విజయవంతమయింది. నాలుగు సంస్థలు డీపీఆర్ అందజేశాయి. త్వరలో ఆర్‌ఎఫ్‌పీ పిలుస్తాం. నిధులను సమకూర్చుకునే అంశంపై ఆలోచిస్తున్నాం. కేంద్ర సహకారం కోసం ఎంపీ శ్రీభరత్ సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే నగరంలో రోడ్డుప్రమాదాలు, నేరాల సంఖ్య తగ్గుతుంది.

- శంఖబ్రత బాగ్చి, సీపీ

లెక్క తేల్చండి!

... 5వ పేజీ తరువాయి

విక్రయిస్తున్నారు. సమీపంలోని లేఅవుట్ నుంచి టన్ను రూ.400కు ఆనందపురం మండలం గండిగుండం, రామవరం, భీమన్నదొరపాలెం గ్రామాలకు చెందిన పలువురు కొనుగోలుచేశారు. దీంతో పాటు ఇనుము, సిమెంట్ కొనుగోలుచేయడం బహిరంగ రహస్యం. ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి, సబ్బవరం మండలాల్లో లేఅవుట్‌ల నుంచి సమీప గ్రామాలకు ఇసుక పబ్లిక్‌గా తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇంకా ప్రతి ఇంటికీ 20 టన్నుల ఇసుక వినియోగించాల్సి ఉన్నా అంత కంటే తక్కువగా వాడుతున్నారు. రూ.1.8 లక్షలతో చేపట్టిన ఇంటి నిర్మాణాలకు, రూ.2.15 లక్షలతో నిర్మించే ఇళ్లకు మధ్య ఇసుక వినియోగంలో తేడా ఉంది. అయినా రెండింటికి ఒకే విధంగా ఇసుక అవసరమని అధికారులు గనులశాఖకు ఇన్‌వాయిస్‌లు జనరేట్ చేస్తున్నారు. కొందరు ఏఈల చేతివాటం హౌసింగ్ సంస్థకు తలనొప్పిగా మారింది. ఇదిలా వుండగా ఉమ్మడి జిల్లాలో నదుల నుంచి తవ్విన ఇసుకను రాజమండ్రి నుంచి తెస్తున్నామని ఒక ట్రాన్స్‌పోర్టర్ తప్పుడు రవాణా బిల్లులు పెట్టారనే ఆరోపణలున్నాయి. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్, ఇసుక సరఫరా, వినియోగంపై పూర్తిస్థాయిలో లెక్కలు తేల్చడానికి వీలుగా ఆడిట్ చేయాలని ఆదేశించారు. త్వరలో గనులుశాఖ, హౌసింగ్ సంస్థ సంయుక్తంగా ఇసుక వినియోగంపై లెక్కలు తేల్చనున్నాయి.

కాంట్రాక్టర్‌కు నోటీసులు

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. కానీ జోన్-6 రెవెన్యూ అధికారులు కాంట్రాక్టర్ మార్చి నుంచి మే వరకు వసూలుచేసిన ఆశీలు మొత్తాన్ని జీవీఎంసీకి చెల్లించి, మిగిలిన తొమ్మిది నెలలకు వేలం మొత్తాన్ని లెక్కించి వసూలుచేసేలా స్టాండింగ్ కమిటీ తీర్మానం చేసినట్టు మినిట్స్‌లో నమోదు చేయించారు. దీనిపై ఈనెల 11న 'గాజువాక మార్కెట్‌లో మాయగాళ్లు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జోన్-6 రెవెన్యూ అధికారులు మార్కెట్ ఆశీలు కాంట్రాక్టర్‌కు నోటీసు జారీచేశారు.

బీజేపీలో జోష్

... 5వ పేజీ తరువాయి

మాట్లాడారు. దేశం, రాష్ట్రం అభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి కోసం తెచ్చిన పరిశ్రమలు, ప్రాజెక్టుల గురించి వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదని, ఇందుకు అవసరమైన నిధులను ఇస్తోందన్నారు. భవిష్యత్తులో మరింత చేయూత అందిస్తామని స్పష్టం చేశారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోయేందుకు మోదీ ఇతోధికంగా సాయపడుతున్నారన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునేందుకు గతంలో వాజపేయి, ఇప్పుడు మోదీ సర్కారు అందించిన సహాయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. సుమారు రూ.11,500 కోట్ల గ్రాంట్‌ను ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంటుకు అందించి ఆదుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా కంకణ బద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత బీజేపీ తీసుకుందన్నారు. అగ్ర నాయకుల ప్రసంగాలకు పార్టీ శ్రేణుల నుంచి మంచి స్పందన వచ్చింది. అంతకుముందు పార్టీ నాయకులకు శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఓపెన్ టాప్ వాహనంపై నడ్డా, మాధవ్ తదితర నేతలు ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్నారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను సందర్శించారు. అరకు కాఫీ, ఏటికొప్పాక బొమ్మలు, కొబ్బరిపీచుతో తయారు చేసిన వస్తువులు, పొందూరు ఖాదీ ఉత్పత్తులను పరిశీలించారు. నడ్డాతో పాటు ఇతర ప్రముఖులకు జీసీసీ అధికారులు బహుమతులను అందించారు. అనంతరం వేదికపైకి చేరుకున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్‌కు రాష్ట్ర నేతలు స్వాగతం పలికారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామ రాజు ఆధ్వర్యంలో జేపీ నడ్డా, మాధవ్‌లను గజమాలతో సత్కరించారు. అంతకుముందు సభా ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, విష్ణుకుమార్ రాజు, కామినేని శ్రీనివాస్, నడుకుదిటి ఈశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

భారీగా హాజరైన శ్రేణులు..

సభకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే సభా ప్రాంగణానికి రావడం మొదలుపెట్టారు. 11 గంటలకు ముఖ్య నాయకులు వేదికపైకి వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ సాగింది. వర్షం వచ్చినా ఆటంకం లేకుండా భారీ రెయిన్ ప్రూఫ్ టెంట్లు వేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



మహారాణిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహారాణిపేటలోని సెంచూరియన్ క్లబ్ వద్ద వంకల వీధి యూత్ ఆధ్వర్యంలో జరిగే దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

17న మెగా రక్తదానం

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ తెరపాంత్ యువక్ పరిషద్ ఆధ్వర్యంలో విశాఖలో ఈనెల 17న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు పరిషద్ ప్రతినిధులు పరశా బంతియా, వీనిత్ గోలీచా తెలిపారు. ఆదివారం వారు డాబాగార్డెన్స్‌లోని పరిషద్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సొంతం చేసుకున్నామని తెలిపారు. విశాఖలో కూడా ఆపదలో ఉన్న ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఈ శిబిరం ద్వారా రక్తం సేకరించి అందిస్తామన్నారు. విశాఖలో జరిగే మెగా రక్తదాన శిబిరంలో సుమారు 2500 యూనిట్లు సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. నగరంలోని 60 కేంద్రాల్లో ఈ శిబిరం జరుగుతుందని చెప్పారు. యువత స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేయాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితురాలికి టీడీపీ నాయకుల పరామర్శ

మహారాణిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) :పూర్ణామార్కెట్ వద్ద జరిగిన అగ్ని ప్రమాద ప్రాంతాన్ని టీడీపీ నాయకులు ఆదివారం సందర్శించారు. శనివారం సాయంత్రం మార్కెట్‌లో పోలీసు అవుట్ పోస్టు పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి పక్కనున్న జీవీఎంసీ ప్రచార కంటైనర్ బాక్స్‌కు అంటుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు టీడీపీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో నాయకులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు, జోన్ 4 ప్రజారోగ్య విభాగం ఈ ప్లాస్టిక్ విక్రయ కేంద్రాన్ని మహిళా స్వయం సహాయక సంఘం ద్వారా దుర్గా అనే మహిళ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రమాదంలో షాపులోని సామగ్రి మొత్తం కాలిబూడిదైంది. బాధితురాలికి న్యాయం చేస్తామని సుధాకర్ హామీ ఇచ్చారు. మరో షాపు ఏర్పాటు చేసేలా జీవీఎంసీ అధికారులతో మాట్లాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విల్లూరి భాస్కర రావు, బుచ్చా రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని ప్రతి గడపకు పార్టీని తీసుకెళ్లాలి

» బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం సాయంత్రం హోటల్ గ్రాండ్ బేలో పార్టీ పదాధికారులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి పార్టీని చేరువ చేయాలని, ఆ దిశగా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. అవసరమైతే చేరికలను ప్రోత్సహించాలని సూచించారు. పార్టీ పట్ల ఆసక్తి ఉన్న వారిని ఆహ్వానించాలన్నారు. అదే సమయంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని, నాయకులు బేధాభిప్రాయాలను పక్కన పెట్టి పార్టీకి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పాల్గొన్నారు.

కళాకారులతో సాంస్కృతిక వైభవం



మాట్లాడుతున్న ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కళాకారులతో సాంస్కృతిక వైభవం కలుగుతుందని ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ అన్నారు. ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మిరాకిల్ డ్యాన్స్ ఆధ్వర్యంలో నృత్య పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నృత్య కళాకారులు నాట్య గురువులు చెప్పే అంశాలపై అవగాహన పెంపొందించుకుని రంగంలో రాణించాలన్నారు. అనంతరం నృత్య కళల అభివృద్ధికి కృషి చేస్తున్న జి. రాజేశ్వరి, ఎం. రాజేశ్వరి, భవ్య రాశి, కల్యాణ్ నాట్య గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మహమ్మద్ షకీల్ అధ్యక్షత వహించగా మహమ్మద్ తాజ్, నృత్య గురువులు, కళాకారులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

మహారాణిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు ఆదివారం ఆయన నగర పర్యటనలో భాగంగా పాత పోస్టాఫీసు ఏరియా లో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. అధికారులు వసతి గృహంలో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయనతో పాటు బీసీ వెల్ఫేర్ అధికారి కె. రామారావు, తదితరులు ఉన్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి నారసింహ అష్టోత్తర శతనామావళి (108) పఠిస్తూ ప్రతి నామానికి సిరి సంపెంగలతో పూజలు చేశారు.

ముగిసిన మూట్ కోర్టు పోటీలు



విజేతలతో ముఖ్య అతిథులు, పోటీల నిర్వాహకులు

మధురవాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్‌వీపీ లా కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అక్వార్‌దాస్ నేషనల్ మూట్ కోర్ట్ పోటీలు ఆది వారంతో ముగిసాయి. దేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన 30 లా కళాశాలలు, యూనివర్సిటీల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. బెంగళూరుకు చెందిన బీఎం ఎస్ కాలేజీ విద్యార్థులు మొదటి బహుమతి పొంది రూ. 40 వేలు నగదు పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఐసీఎఫ్ఏఐ లా యూనివర్సిటీ విద్యార్థులు ద్వితీయ స్థానం పొందారు. వారికి రూ. 25 వేలు నగదు బహుమతి అందజేశారు. ఉత్తమ వక్తగా ఎస్. మంజరి (కోయంబత్తూరు), ఉత్తమ పరిశోధకురాలుగా శ్రేష్ఠ (పంజాబ్) ఎంపికయ్యారు. వారికి రూ.10 వేలు చొప్పున నగదు పురస్కారం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఐఏఎం విశాఖపట్నం డైరెక్టర్ జనరల్ డాక్టర్ వి.కృష్ణమోహన్, ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ మాజీ అధక్షుడు గంటా రామారావు,సీనియర్ న్యాయవాది వి. రవీంద్రప్రసాద్, ఎన్‌వీపీ లా కళాశాల కరస్పాండెంట్ సుంకరి రవీంద్ర, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్, ఏయూ బీఆర్ అంబేద్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ సీతామాణిక్యం, కళాశాల ప్రిన్సిపాల్ అలక్ చంద్రుడు పాల్గొన్నారు.

ఆగమ పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

» వారం రోజుల క్రితం ఘటన

» నాటి నుంచే పాఠశాలకు సెలవులు



తాళాలు వేసి ఉన్న పాఠశాల

సింహాచలం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆగమ పాఠశాల విద్యా ర్థులు అస్వస్థతకు గురయ్యారు. వారం రోజుల క్రితం గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా విద్యార్థులు బయట కేటరింగ్ నుంచి రాత్రి భోజనం తెప్పించుకున్నారు.అది తిని అస్వస్థతకు గురైనట్టు తెలిసింది. బాధితులకు స్థానిక గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేశారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో అపోలో ఆస్పత్రిలో చేర్చారు.విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారం రోజుల క్రితం పాఠశాలకు సెలవులు ఇచ్చి, మూసివేశారు. ఈ విషయమై పాఠశాల పర్యవేక్షణాధికారిని వివరణ కోరగా విద్యార్థు లకు ఆరోగ్య సమస్యలు వచ్చిన మాట వాస్తవమేనని చెప్పారు. ఉన్న తాధికారుల ఆదేశాల మేరకు వారం రోజుల క్రితమే పాఠశాలకు దసరా సెలవులు ప్రకటించినట్టు చెప్పారు.

నేడు వైష్ణవ జన్మాష్టమి వేడుకలు

ఆరిలోవ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ భగవానుడి తిరు నక్షత్రం (కణ్ణన్ తిరు నక్షత్రం) శ్రీ వైష్ణవ జన్మాష్టమిని పురష్కరించుకొని జీవీఎంసీ 10వ వార్డులో గల రాజీవ్ నగర్‌లో వెలసిన లక్ష్మీనారాయణ ఆలయంలో సోమవారం సాయంత్రం శ్రీకృష్ణ భగవానుడికి అభిషేకం, అలంకరణ, అర్చన, మంగళశాసనం, తనియ విన్నపము. తీర్థ ప్రసాదాల గోష్ఠి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా మెహర్ బాబా కేంద్రం వార్షికోత్సవం

పద్మనాభం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవిడి గ్రామంలో అవతార్ మెహర్ బాబా కేంద్రం 17వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తన చేపట్టారు. అనంతరం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం వి. శంకరరావు సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు కొండలరావు, పావని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాబా చూపిన ప్రేమతత్వంతో ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలన్నారు. బాబా బోధలను వివరించారు. ఈ కార్యక్రమంలో రేవిడి కేంద్రం నిర్వాహకులు ఎం. సత్యబాపిరాజు, కమల్, సహవాస్, కార్యనిర్వాహకులు రామారావు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లోని 20 కేంద్రాల నుంచి బాబా ప్రేమికులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఆరిలోవ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవలోని సిద్ధార్థనగర్‌లో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ కృష్ణ, సిబ్బందితో కలిసి దాడి చేసి, పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1.52 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న పారా లీగల్ వలంటీర్ భవాని

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతు బజార్‌లో వివిధ ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ లభించే రుణాలపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా న్యాయ సలహా సర్వీస్ అథారిటీ న్యాయవాది, పారా లీగల్ వలంటీర్ భవానీ రైతులు, వినియోగదారులతో మాట్లాడారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయకులు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 28, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 38, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమ దుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడుచిక్కుడు 76, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	132
లైవ్ ధర	152
విత్ స్కిన్	274
స్కిన్‌లెస్	284

రైతుబజార్‌లో నాణ్యత లేని సరుకులు

- నాసిరకం ఉల్లిపాయలు, పాడైన టమాటా విక్రయం
- కొనుగోలుదారుల గగ్గోలు
- పట్టించుకోని అధికారులు

పెదవాల్తేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుబజార్‌లో ఆదివారం రాయితీపై కిలో రూ.15కు విక్రయిస్తున్న రాయితీ ఉల్లిపాయలు నాసిరకంగా ఉన్నాయంటూ కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటల నుంచి రైతుబజార్‌లోని 4 డ్వాక్రా కౌంటర్ల ద్వారా మార్కెటింగ్ శాఖ అధికారులు ఉల్లి విక్రయాలు చేపట్టారు. అయితే ఈ ఉల్లిని కొనేందుకు వినియోగదారులు ఆసక్తి చూపలేదు. వీటిలో కుళ్లిపోయిన, మొలకెత్తిన ఉల్లి ఉండడంతో పాటు వాసన వస్తుండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు పెద్దగా ముందుకు రాలేదు.

రాయితీపై విక్రయించేందుకుఆదివారం కర్నూలు ఉల్లిపాయలు 40 బస్తాలు వచ్చాయి. ఒక బస్తాకు 45 కిలోలు చొప్పున మొత్తం 1800 కిలోల విక్రయం నిమిత్తం రైతుబజార్‌కు తీసుకువచ్చారు. ఈ ఉల్లిపాయలు నాసిరకంగా ఉండడంతో కొనడానికి ఆసక్తి చూపలేదు. బయట మార్కెట్‌లో కిలో రూ.36కు విక్రయిస్తున్నప్పటికీ వాటిని కొనేందుకు మొగ్గు చూపారు. తమకు కుళ్లి పాడైన, మొలకెత్తిన ఉల్లి వల్ల నష్టం చేకూరే అవకాశం ఉందని డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాయితీపై విక్రయించేందుకు వచ్చిన నాసిరకం ఉల్లి



పాడైపోయిన టమాటాలు

ఈ విషయమూ రైతుబజార్ ఈవో సత్యకళ వద్ద ప్రస్తావించగా.. రద్దు ఉల్లిపై అధికారులు మినహాయింపు ఇస్తున్నట్టు అమె తెలిపారు. అలాగే పెదవాల్తేర్ రైతుబజార్‌లో ఆదివారం కిలో టమాటా రూ 24 కు విక్రయాలు చేపట్టారు. అయితే టమాటా కూడా నాసిరకంగా, కుళ్లి పాడై ఉన్నాయని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్‌లో గ్రేడింగ్ చేసి విక్రయాలు చేస్తామని మార్కెటింగ్ ఆధికారులు చెబుతున్నారని, కానీ పెదవాల్తేర్ రైతుబజార్‌లో నాసిరకం ఉల్లిపాయలు, టమాటాలు విక్రయిసున్నా పట్టించుకోవడం లేదని కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్‌కు వచ్చి ఖాళీగా చేతులతో తిరిగి వెళ్లలేక నాణ్యత లేని కూరగాయలు కొనాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

మార్షల్ ఆర్ట్స్‌తో మనోవికాసం, శారీరక దారుఢ్యం

- లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్




విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మానసిక, శారీరక దారుఢ్యానికి మార్షల్ ఆర్ట్స్ ఉపయోగపడుతుందని లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ అన్నారు. శివాజీ పార్కులో ఆదివారం బోధిధర్మ యుద్ధ కళాక్షేత్రం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశిష్ట అతిథులుగా ఏసీపీ లక్ష్మణ మూర్తి, బీవైకేకే వ్యవస్థాపకుడు దయామయ, కర్షక దేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆడారి కిషోర్‌కుమార్, హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

విశాఖలో కేటీఎం డ్యూక్ 160 బైక్ ఆవిష్కరణ



కేటీఎం డ్యూక్160 బైక్ ఆవిష్కరణలో వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిశోర్



డ్యూక్ 160 బైక్‌పై ప్రభుకిశోర్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేటీఎం కొత్తగా రూపొందించిన డ్యూక్ 160 బైక్‌ను కేటీఎం అథరైడ్జ్ డీలర్ వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ (విశాఖపట్నం) అందుబాటు లోకి తీసుకువచ్చింది. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికివరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభ కిశోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ఇతర అతిథులు సౌత్ సేల్స్ సర్కిల్ హెడ్ వి. కార్తీక్, ఏపీ ఏరియా సేల్స్ మేనేజర్ పి. హరీశ్, వరుణ్ బజాజ్ సీఈఓ ఆడారి శ్రీనివాస్‌తో కలిసి కేటీఎం డ్యూక్ 160 బైక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభ కిశోర్ మాట్లాడుతూ ఇది కేవలం బైక్ లాంచ్ మాత్రమే కాదని, ఫ్యాషన్, పవర్, పెర్ఫార్మెన్స్‌ల పండుగ అని తెలిపారు. కొత్త బైక్‌ను ప్రత్యక్షంగా చూడడమే కాకుండా టెస్ట్ రైడ్ కూడా చేయవచ్చునని చెప్పారు. సౌత్ సేల్స్ సర్కిల్ హెడ్ వి. కార్తీక్ మాట్లాడుతూ కేటీఎం 160 బైక్ ప్రత్యేక స్టైల్‌ను సంతరించుకుందన్నారు. పవర్‌తో పాటు పూర్తిస్థాయి టెక్నాలజీ ఈ బైక్ సొంతమని తెలిపారు. అనంతరం కేటీఎం గ్లోబ్ బ్రాండ్ డిస్‌ప్లే విధానం, ఇతర అంశాలను బైక్ ఆవిష్కరణలో ప్రదర్శించిన తీరు వినియోగదారులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు



కార్యక్రమంలో సోము వీర్రాజు, రవీంద్ర, ప్లాటిపస్ ఫౌండేషన్, గ్రీన్ పోయేట్స్ గీతం విద్యార్థులు తదితరులు

పెదవాల్తేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణఅందరి బాధ్యత అని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. ఆదివారం లాసన్స్ బే కాలనీ బీచ్, పెదజాలారిపేట తీర ప్రాంతంలో ప్లాటిపస్ ఫౌండేషన్, గ్రీన్ పోయెట్స్, గీతం విద్యార్థులు ఆర్గనైజింగ్ బృంద సభ్యులు 42 మంది స్వచ్ఛంద సేవకుల సహకారంతో బీచ్ పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సోము వీర్రాజు, బీజేపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీర పరిశుభ్రత కార్యక్రమం ద్వారా 200 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం జరిగిందని, ఈ వ్యర్థాలన్నీ జాలరిపేట, ఎండాడ పక్కన ఉన్న కాలువ ద్వారా సముద్రంలో కలుస్తున్నాయి అన్నారు. ఈ కాలువలకు జాలీలు వేయకపోవడం వల్ల సముద్రంలో కలుస్తున్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్లాటిపస్ ఫౌండేషన్ ప్రతినిధులు సుభాశ్‌చంద్రన్, గ్రీన్ పోయెట్స్ సొసైటీ సభ్యులు సిద్ధార్థ్ పల్లా పాల్గొన్నారు.

భీమునిపట్నంలో..

భీమునిపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మిషన్ గ్రీన్ భీమిలి సభ్యులు అన్నారు. ఆదివారం వారు లక్ష్మీనరసింహస్వామి కొండపై డ్రోన్ సహాయంతో మూడు కోట్ల విత్తనాలను జల్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లుగా కొండవాలు ప్రదేశంలో విత్తన బంతులు జల్లుతున్నామని,ఈసారి డ్రోన్ సహాయంతో మూడు కోట్ల విత్తనాలు జల్లినట్టు తెలిపారు. అంతకముందు నేరెళ్లవలస కాలనీలో టీడీపీ యువనేత గంటా రవితేజ మిషన్ గ్రీన్ భీమిలి ప్రతినిధులు డాక్టర్ ముమ్మిడిశెట్టి ఆదిత్య, గుల్లల వెంకటేశ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడిశెట్టి సత్యానందరావు, మైలపల్లి షణ్ముఖరావు, మునునూరి సూర్య శ్రీనివాసరావు, కాళ్ల సన్నీ, విజ్జపు సత్యనారాయణ, కట్టమూరి అశోక్, మారోజు గోపి, పెంటపల్లి దేవానంద్ పాల్గొన్నారు.

'విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం'



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న గంటా రవితేజ

ఆనందపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ అన్నారు. ఆదివారం గిడిజాల సమీపంలో ఉన్న మహలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేజీబీవీ విద్యార్థినుల విహార యాత్ర, ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ లోనే మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి, పట్టుదలతో లక్ష్య సాధనకు శ్రమించాలని చెప్పారు. కేజీబీవీని దత్తత తీసుకుని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్‌ను అభినందించారు. ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ తమ సంస్థ పేద విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు. ఇకపై పాఠశాల నుంచి ఏటా ఉత్తమ ఫలితాలు సాధించిన బాలిక లను తమ ఖర్చుతో ఉన్నత చదువులు చదివించనున్నట్టు ప్రకటించారు. అనంతరం మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యాలయం ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే బాలి కలకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బీఆర్‌బీ నాయుడు, పాండ్రంకి అప్పలరాజు, మరుపిళ్ల సాయి జ్ఞానేశ్వర్, కోరాడ వైకుంఠరావు,రౌతు నాగరాజు, కాకర సురేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. లావణ్య, ఏపీసీజే అసోసియేషన్ చైర్మన్ శివాజీ, వైస్ చైర్మన్ మంగప్పన్న పాల్గొన్నారు.

ఉత్సాహంగా నేవీ సన్నాహక మారథాన్

- పాల్గొన్న పలువురు క్రీడాకారులు
- విజేతలకు బహుమతుల ప్రదానం
- డిసెంబరు 14న 'వన్ రన్ - నేషన్ మారథాన్' నినాదంతో భారీ ఎత్తున కార్యక్రమం



సన్నాహక మారథన్‌లో పాల్గొన్న నేవీ సిబ్బంది, క్రీడాకారులు తదితరులు

రోడ్డు, సెప్టెంబర్ 14, (ఆంధ్రజ్యోతి) : విశాఖ సాగర తీరంలో 'వన్ రన్ - వన్ నేషన్' నినాదంతో డిసెంబర్ 14న నిర్వహించనున్న వైజాగ్ నేవీ మారథాన్-2025కు సంబంధించి ఆదివారం బీచ్‌రోడ్డులో సన్నాహక మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 42కె, 21కె 10కె, 5కె పరుగు పందాలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.పలువురుక్రీడాకారులు, ఔత్సాహికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కెప్టెన్ ఎం.డి. అనూప్‌రాజ్ మాట్లాడుతూ క్రీడలతో ఒత్తిడి దూరమై మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యం సొంతమవుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులు నిత్యం విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు తమకు ఆసక్తి ఉన్న క్రీడాంశంలో సాధన చేయాలని సూచించారు. జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ నిత్యం విధుల్లో సతమతమయ్యే ఉద్యోగులు తరచూ అనారోగ్యం బారిన పడుతుంటారని, అలాంటి వారు రోజూ క్రీడలు సాధన చేస్తే ఇబ్బందులు తొలగి, ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఏటా ఇలాంటి పోటీలు ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. నేటి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని వెల్లడించారు. అనంతరం పరుగు పందాల్లో గెలుపొందిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కెప్టెన్ వినోద్ తివారీ, డిప్యూటీ రేస్ డైరెక్టర్, లెఫ్టినెంట్ కమాండర్ మెగ్నాన్ నాయుడు, రేస్ కో-ఆర్డినేటర్ జోన్- 3 కమిషనర్ శివప్రసాద్, నేవీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

110 మందికి ఉచిత వైద్యసేవలు



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆరిలోవ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల రామకృష్ణాపురంలో ఆదివారం జేడీఎస్ ఆస్పత్రి (గతంలో ఏఎంజీ ఆస్పత్రి)లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లాలా సంతోష్ 110 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సంఘం గ్రామ అధ్యక్షుడు వంకరబాబూరావు, కాకర గోవింద్, గాడి కృష్ణ, నల్లా సింహాచలం, ఆస్పత్రి సిబ్బంది అనిల్, రేవతి, ఆర్జీ నాయడు తదితరలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి యువకుడి మృతి



జగదీశ్ (ఫైల్)

ఆనందపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమగొట్టి పాలెం సమీపంలో ఆటో బోల్తా పడడంతో ఒక యువకుడు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. సీఐ చింత వాసునాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. భీమిలి మండలంలోని రాజలింగంపేటకు చెందిన బోర రామారావు కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో ఆనందపురంలోని గిరిజాల సమీపంలో ఉన్న ధార పైడితల్లమ్మ ఆలయానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆటో డ్రైవర్ వంశీ వాహ నాన్ని నిర్లక్ష్యంగా నడపడంతో వేమగొట్టిపాలెం సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో బోర జగదీశ్ (22) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా, బర్ల సాయి, పల్లా సాయికుమార్‌కు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి బోర రామారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో రైతు మృత్యువాత

- భూములకు నష్ట పరిహారంపై నిరసన శిబిరంలో కుప్పకూలిన బాధితుడు



చంద్రరావు (ఫైల్‌ఫొటో)

పెందుర్తిరూరల్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): తమకు భూములకు తగిన నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ తలపెట్టిన ఆందోళన శిబిరంలోనే ఓ బాధిత రైతు గుండెపోటులోనై దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన పెందుర్తి మండలం పోర్లుపాలెంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలివి.. అదనపు రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం రైల్వేశాఖ స్థానిక రైతుల నుంచి వ్యవసాయ భూములను సేకరిస్తోంది. ఈ స్థితిలో పరిహారం కోసం నిరసన చేపడుతున్నారు. ఈ క్రమంలోగ్రామానికి చెందిన రాపర్తి చంద్రరావు (61) శిబిరంలో ఆదివారం నినాదాలు చేస్తూ ఒక్కసారిగా గుండెపోటుకు లోనై అక్కడిక్కడే మృత్యువాత పడ్డారు. ఈ సంఘటనపై మాజీ ఉప సర్పంచి మండల రెవెన్యూ, పోలీసు, రైల్వే అధికారులకు సమాచారమందించారు. మృతుడు చంద్రరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

టార్గెట్‌బాల్ చాంపియన్ తూర్పు గోదావరి

- ద్వితీయ స్థానం నిలిచిన శ్రీకాకుళం జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన తూర్పు గోదావరి జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

ఆరిలోవ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సబ్ జూనియర్ బాల బాలికల టార్గెట్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీలో తూర్పు గోదావరి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం జిల్లా జట్టు నిలిచింది. అలాగే బాలికలమిక్స్ విభాగంలో కూడా తూర్పు గోదావరి జిల్లా జట్టు విజేతగా నిలవగా, రెండో స్థానంలో ప్రకాశం జిల్లా జట్టు నిలిచింది. ఈ పోటీలకు మొత్తం 9 జిల్లాల నుంచి 300 మంది క్రీడా కారులు పాల్గొన్నట్టు పోటీల నిర్వాహకుడు, జిల్లా కార్యదర్శి కె.ప్రేమసాయి వెల్లడించారు. విజేతలకు ఆంధ్రప్రదేశ్ టార్గెట్బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సురేష్ కుమార్, హ్యాండ్‌బాల్ జాతీయ క్రీడాకారలు పి.సత్యనారాయణ రాజు, సుధాకర్ మోహన్, ముఖ్య అతిథులుగా విచ్చేసిక్రీడాకారులకు బహుమతులను ప్రదానంశాఆరు.ఈ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడా కారులకు అక్టోబర్‌లో భోపాల్‌లో జరిగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్టు ప్రేమసాయి తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాపరుద్ర, ముస్తాఫా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆరిలోవ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చదువు వల్లే సమాజంలో హోదా, తద్వారా గుర్తింపు లభిస్తుందని, అందుకే ప్రతి విద్యార్థి కష్టపడి చదవడానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెలే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్‌రుద్ర పేర్కొన్నారు. ఆదివారం ఆరిలోవలో గల ముస్తాఫా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిలా దున్నబీ 1500 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 250 మంది విద్యార్థటకు నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఖలీషాను ప్రతాపరుద్ర అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, టీడీపీ 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎం.రాజారావు, టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, టీడీపీ సీనియర్ మహిళా నాయకురాలు రేఖాజ్యోతి పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట



హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో పందిరిరాట వేస్తున్న శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం ప్రతినిధులు, స్థానికులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాల సందర్భంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పలు సంఘాలు, యువకులు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో పందిరి రాటను వేశారు. జీవీఎంసీ 16వ వార్డు పాత వెంకోజీపాలెం శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లోని ఖాళీ స్థలంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల కోసం సంఘం కార్యవర్గ సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొని పూజలు నిర్వహించి పందిరి రాటను వేశారు. దసరాకు అమ్మవారిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహించి, నిమజ్జనం చేయనున్నట్టు సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులతో పాటు స్థానిక పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. అలాగే 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో ముహూర్తపు రాటను వేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు బోను సూరిబాబు, కర్రి గౌరీ తదితరులు పాల్గొన్నారు. కొత్త వెంకోజీపాలెం ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న శ్రీవీరాంజనేయ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో దేవీనవరాత్రుల ఉత్సవాల కోసం పందిరి రాటను వేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు మళ్లరవి, అప్పలరాజు పాల్గొన్నారు.

దళిత బహుజనులు ఏకం కావాలి

» యూపీఎస్సీ పూర్వ సభ్యుడు, ద్రావిడ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ కేఎస్ చలం



సమావేశంలో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

సీతమ్మధార, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అనేక వర్గాలుగా విభజించబడిన దళిత బహుజనుల ఏకం కావాలని యూపీఎస్సీ పూర్వ సభ్యుడు, ద్రావిడ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ కేఎస్ చలం పిలుపునిచ్చారు. నగరంలోని ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం భీమ్‌సేన వార్ ఆధ్వర్యంలో మహా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చలం మాట్లాడుతూ దళిత బహుజనులంతా అనేక పార్టీల కింద విభజించబడి ఉన్నారని, వారంతా ఏకమై హక్కుల సాధన, రాజ్యాధికారం దిశగా పయనించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్, పెరియార్ రామస్వామి కలిసి దేశమంతా తిరిగి ఉద్యమాన్ని నిర్మించారని చెప్పారు. రిజర్వేషన్లు తొలిసారి తమిళనాడులో అమల్లోకి వచ్చాయని వాటికి ఆటంకం ఏర్పడితే 1951లో తొలి రాజ్యాంగ సవరణ జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో దుప్పల రవికుమార్, రాజేంద్రప్రసాద్, కె.చిన్నారావు, బల్లంకి కనకరాజు, మధు కుంచే, జి.రవికుమార్, కొల్లాబత్తుల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రగతిలో ఉపాధ్యాయులది పాత్ర కీలకం

» ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ బాలమోహన్‌దాస్


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న బాలమోహన్‌దాస్ తదితరులు

సీతమ్మధార, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి ప్రగతిలో ఉపాధ్యాయులది అత్యంత ముఖ్యమైన పాత్ర అని నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి వి.బాల మోహన్‌దాస్ పేర్కొన్నారు. బాల వికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ 2024-25 ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణ యూనివర్శిటీ మాజీ ఉపకులపతి ఎస్.రామకృష్ణారావు, సిక్కిం మాజీ డీజీపీ అత్తిలి సుధాకర్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా తిరుమల శ్రీదేవి, కుమారస్వామి, సుజాత, మోహనరావులను సత్కరించారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, కామేశ్వరి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కేరళీయుల ఓనం ముగింపు వేడుకలు


సీపీ శంకబ్రత బాగ్చీని సత్కరిస్తున్న కళాసమితి సభ్యులు

మురళీనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గంలోని మురళీనగర్ హైవేలోని కేరళ కళా సమితిలో ఆదివారం ఓనమ్ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. మలయాళీ సమాజం ఒక్క చోట చేరి సంప్రదాయ పండుగను వేడుకగా నిర్వహించుకున్నారు. కళా కేరళం ఆడిటోరియంలో సమితి ప్రధాన కార్యదర్శి కె.హరిదాస్ పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో నగరం నలుమూలల నుంచి కేరళీయులు హాజరై తమ సంప్రదాయ వస్త్రధారణ, నృత్య ప్రదర్శనలు, సహపంక్తి భోజనాలతో సందడి చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కేరళ కళా సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. వేడుకల్లో విశాఖ వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు తదితరులు హాజరయ్యారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



మహారాణిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహారాణిపేటలోని సెంచూరియన్ క్లబ్ వద్ద వంకల వీధి యూత్ ఆధ్వర్యంలో జరిగే దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

17న మెగా రక్తదానం

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ తెరపాంత్ యువక్ పరిషద్ ఆధ్వర్యంలో విశాఖలో ఈనెల 17న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు పరిషద్ ప్రతినిధులు పరశా బంతియా, వీనిత్ గోలీచా తెలిపారు. ఆదివారం వారు డాబాగార్డెన్స్‌లోని పరిషద్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సొంతం చేసుకున్నామని తెలిపారు. విశాఖలో కూడా ఆపదలో ఉన్న ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఈ శిబిరం ద్వారా రక్తం సేకరించి అందిస్తామన్నారు. విశాఖలో జరిగే మెగా రక్తదాన శిబిరంలో సుమారు 2500 యూనిట్లు సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. నగరంలోని 60 కేంద్రాల్లో ఈ శిబిరం జరుగుతుందని చెప్పారు. యువత స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేయాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితురాలికి టీడీపీ నాయకుల పరామర్శ

మహారాణిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) :పూర్ణామార్కెట్ వద్ద జరిగిన అగ్ని ప్రమాద ప్రాంతాన్ని టీడీపీ నాయకులు ఆదివారం సందర్శించారు. శనివారం సాయంత్రం మార్కెట్‌లో పోలీసు అవుట్ పోస్టు పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి పక్కనున్న జీవీఎంసీ ప్రచార కంటైనర్ బాక్స్‌కు అంటుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు టీడీపీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో నాయకులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు, జోన్ 4 ప్రజారోగ్య విభాగం ఈ ప్లాస్టిక్ విక్రయ కేంద్రాన్ని మహిళా స్వయం సహాయక సంఘం ద్వారా దుర్గా అనే మహిళ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రమాదంలో షాపులోని సామగ్రి మొత్తం కాలిబూడిదైంది. బాధితురాలికి న్యాయం చేస్తామని సుధాకర్ హామీ ఇచ్చారు. మరో షాపు ఏర్పాటు చేసేలా జీవీఎంసీ అధికారులతో మాట్లాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విల్లూరి భాస్కర రావు, బుచ్చా రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని ప్రతి గడపకు పార్టీని తీసుకెళ్లాలి

» బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం సాయంత్రం హోటల్ గ్రాండ్ బేలో పార్టీ పదాధికారులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిం చారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి పార్టీని చేరువ చేయాలని, ఆ దిశగా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. అవస రమైతే చేరికలను ప్రోత్సహించాలని సూచించారు. పార్టీ పట్ల ఆసక్తి ఉన్న వారిని ఆహ్వానించాలన్నారు. అదే సమయంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని, నాయకులు బేధాభిప్రాయాలను పక్కన పెట్టి పార్టీకి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పాల్గొన్నారు.

ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ లీగ్ చాంప్ విశాఖ


క్రీడాకారులను అభినందిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ లీగ్ టోర్నీలో ఆతిధ్య విశాఖ ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్నది. ద్వితీయ స్థానంలో గుంటూరు, తృతీయ స్థానంలో శ్రీకాకుళం నిలిచాయి. ఏయూ ఇండోర్ హాలులో జరిగిన టోర్నీకి ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు పి.గణబాబు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధతతో సాధన చేసి ఉన్నత స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. క్రీడాకారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ద ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ మాట్లాడుతూ క్రీడా కేంద్రంగా రూపొందుతున్న విశాఖలో మరన్ని క్రీడా వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, త్వరలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర ప్రతినిధి ఆనందబాలు, కోచ్‌లు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ మీట్‌కు కోచ్‌గా శ్రీనివాసరావు



విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ జట్టుకు నగరానికి చెందిన కోచ్‌గా పిట్టా శ్రీనివాసరావు (రైల్వేస్) వ్యవహరించనున్నారని ఏపీ అథ్లెటిక్స్ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎం.నారాయణరావు తెలిపారు. అలాగే ఈ టోర్నీకి సీహెచ్ చరణ్, ఎస్.కృష్ణమూర్తి, డాక్టర్ ఎల్.ప్రవీణ్‌కుమార్ సాంకేతిక నిపుణులుగా నియమితులయ్యారని పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 25 వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనవర్సిటీలో జరగనున్న ఈ టోర్నీలో విశాఖ నుంచి బాలుర విభాగంలో షేక్ బషీర్, డి.బాలు, చింతల వినోద్, టి.గోపాలకృష్ణ, టి.చంద్రశేఖర్, డి.రహుల్ సాయికుమార్, డి.శేషు, కిరణ్‌సాయి, రెడ్డి శశాంక్, కె.సాయి కార్తికేయ, పి.రాజశేఖరరెడ్డి, వి.సంహాచలం, కెఆర్‌వీఎం.కుమార్ దొర, వి.శ్యాం భగవాన్, మద్ది వికాస్, గల్లెల రాంచరణ్, డి.రామ్ హితేష్...బాలికల విభాగంలో కెపిజి.కుమారి, ఎం.నాగసాయి వర్షిణి, పి.హాసిని, అయేష బాను, బి.శైలజ, పి.తిరీషా, కాంక్షశ్రీ, పి.తేజశ్వని, కె.రాగిణి, ఒమ్మి సిరిచందన, సిహెచ్.బార్గవి, సత్య సహస్రిక, ప్రవల్లిక రెడ్డి, ఎం.లక్ష్మీ, ఎన్.బిందుహాసిని, బి.చైతన్య, బి.ఇషానా ప్రాతినిధ్యం వహించనున్నారన్నారు.

అభివృద్ధి పనులపై డీఆర్‌ఎం సమీక్ష

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డీఆర్‌ఎం లలిత్ బొహ్రా ఆదివారం వాల్తేరు డివిజన్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమావేశమై డివిజన్‌లో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి నిర్మాణ పనులు, అమృత భారత్ స్టేషన్ అభివృద్ధి పనులు తదితర అంశాలపై చర్చించారు. పునరుద్ధరించిన ఇంజనీరింగ్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేకే లైనులో బండరాళ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో చేపడుతున్న భద్రతా చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. అలాగే సంసిద్ధత విపత్తులు చర్యలు, భద్రతకు ఇస్తున్న ప్రాధాన్యత వంటి అంశాలను చర్చించారు. రైలు కార్యకలాపాలు సజావుగా సాగాలంటే నిరంతరం అప్రమత్తమంగా వ్యవహరించి భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమయపాలన పాటించి కలిసికట్టుగా పనిచేసి ప్రమాదాల నివారణతోపాటు డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు పునరుద్దరించిన ఇంజనీరింగ్ సమావేశ హాలును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఈ.శాంతారామ్, సీనియర్ డీఈ మొహరానా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ వార్షికోత్సవం

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సేవల్లో ది శ్రీ గౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ ఎప్పుడూ ముందుంటుందని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబు అన్నారు. ఆ సంస్థ 28వ వార్షికోత్సవాన్ని ఆదివారం రైల్వే న్యూ కాలనీలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన గణబాబు మాట్లాడుతూ మంచి ఆర్గనైజేషన్లను ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. అలాంటి వాటిలో గౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ ముందు వరుసలో ఉంటుందని పేర్కొన్నారు. సొసైటీ చైర్మన్ చదరం డీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ తమ సొసైటీలో అతి వేగంగా రుణాలు మంజూరు చేస్తామని, సీనియర్ సిటిజన్లకు ఎక్కువ వడ్డీ అందిస్తున్నామని తెలిపారు. ఏటా మాదిరి ఈ ఏడాది కూడా సభ్యులకు 16 శాతం డివిడెండ్ అందజేస్తున్నామనారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ఆడారి నూకరాజు, కోశాధికారి ఆడారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులు నిత్యావసర సరుకుల పంపిణీ

మాధవధార, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) ; గ్రేటర్ 50వ వార్డులోని మాధవధార మానవసేవే మాధవసేవ అసోసియేషన్ అధ్వర్యంలో ఆదివారం 16 మంది కిడ్నీ రోగులకు నిత్యావసరాల పంపిణీ చేశారు. మురళీనగర్ వాకర్స్‌క్లబ్ వేదికగా చేపట్టి ఈ కార్యక్రమంలో సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.భానుప్రకాశ్, అధ్యక్షుడుఎస్.సీతారామకృష్ణ, ఉపాధ్యక్షులు కెవిఎస్.ప్రసాద్, పి.గిరిధర్, కార్యదర్శి త్రిమూర్తులు తదితరులు హాజరయ్యారు.

కళాకారులతో సాంస్కృతిక వైభవం


మాట్లాడుతున్న ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కళాకారులతో సాంస్కృతిక వైభవం కలుగుతుందని ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ అన్నారు. ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మిరాకిల్ డ్యాన్స్ ఆధ్వర్యంలో నృత్య పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నృత్య కళాకారులు నాట్య గురువులు చెప్పే అంశాలపై అవగాహన పెంపొందించుకుని రంగంలో రాణించాలన్నారు. అనంతరం నృత్య కళల అభివృద్ధికి కృషి చేస్తున్న జి. రాజేశ్వరి, ఎం. రాజేశ్వరి, భవ్య రాశి, కల్యాణ్ నాట్య గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మహమ్మద్ షకీల్ అధ్యక్షత వహించగా మహమ్మద్ తాజ్, నృత్య గురువులు, కళాకారులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

మహారాణిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు ఆదివారం ఆయన నగర పర్యటనలో భాగంగా పాత పోస్టాఫీసు ఏరియా లో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. అధికారులు వసతి గృహంలో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయనతో పాటు బీసీ వెల్ఫేర్ అధికారి కె. రామారావు, తదితరులు ఉన్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి నారసింహ అష్టోత్తర శతనామావళి (108) పఠిస్తూ ప్రతి నామానికి సిరి సంపెంగలతో పూజలు చేశారు.

ముగిసిన మూట్ కోర్టు పోటీలు


విజేతలతో ముఖ్య అతిథులు, పోటీల నిర్వాహకులు

మధురవాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్‌వీపీ లా కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అళ్వార్‌దాస్ నేషనల్ మూట్ కోర్ట్ పోటీలు ఆది వారంతో ముగిసాయి. దేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన 30 లా కళాశాలలు, యూనివర్సిటీల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. బెంగళూరుకు చెందిన బీఎం ఎస్ కాలేజీ విద్యార్థులు మొదటి బహుమతి పొంది రూ. 40 వేలు నగదు పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఐసీఎఫ్ఏఐ లా యూనివర్సిటీ విద్యార్థులు ద్వితీయ స్థానం పొందారు. వారికి రూ. 25 వేలు నగదు బహుమతి అందజేశారు. ఉత్తమ వక్తగా ఎస్. మంజరి (కోయంబత్తూరు), ఉత్తమ పరిశోధకురాలుగా శ్రేష్ఠ (పంజాబ్) ఎంపికయ్యారు. వారికి రూ.10 వేలు చొప్పున నగదు పురస్కారం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఐఏఎం విశాఖపట్నం డైరెక్టర్ జనరల్ డాక్టర్ వి.కృష్ణమోహన్, ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ మాజీ అధక్షుడు గంటా రామారావు,సీనియర్ న్యాయవాది వి. రవీంద్రప్రసాద్, ఎన్‌వీపీ లా కళాశాల కరస్పాండెంట్ సుంకరి రవీంద్ర, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్, ఏయూ బీఆర్ అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ సీతామాణిక్యం, కళాశాల ప్రిన్సిపాల్ అలక్ చంద్రుడు పాల్గొన్నారు.

ఆగమ పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

» వారం రోజుల క్రితం ఘటన
» నాటి నుంచే పాఠశాలకు సెలవులు


తాళాలు వేసి ఉన్న పాఠశాల

సింహాచలం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆగమ పాఠశాల విద్యా ర్థులు అస్వస్థతకు గురయ్యారు. వారం రోజుల క్రితం గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా విద్యార్థులు బయట కేటరింగ్ నుంచి రాత్రి భోజనం తెప్పించుకున్నారు.అది తిని అస్వస్థతకు గురైనట్టు తెలిసింది. బాధితులకు స్థానిక గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేశారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో అపోలో ఆస్పత్రిలో చేర్చారు.విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారం రోజుల క్రితం పాఠశాలకు సెలవులు ఇచ్చి, మూసివేశారు. ఈ విషయమై పాఠశాల పర్యవేక్షణాధికారిని వివరణ కోరగా విద్యార్థు లకు ఆరోగ్య సమస్యలు వచ్చిన మాట వాస్తవమేనని చెప్పారు. ఉన్న తాధికారుల ఆదేశాల మేరకు వారం రోజుల క్రితమే పాఠశాలకు దసరా సెలవులు ప్రకటించినట్టు చెప్పారు.

నగరంలో ఏఐ టీఎంఎస్

... 5వ పేజీ తరువాయి

నోపార్కింగ్‌జోన్‌లో పార్కింగ్, సీటుబెల్ట్ ధరించకపోయినా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపినా కెమెరాలు గుర్తించి, ఫొటోలు, వీడియోలను తీసి, నంబర్‌ప్లేట్ ఆధారంగా జరిమానా లెక్కించి వాహనం యజమాని ఈ-చాలాన్ పంపుతుంది.

నగరంలో చోరీలు, స్నాచింగ్‌లు, దోపిడీలు, హత్యలు, దాడులు, ఈవ్‌టీజింగ్‌లకు అడ్డుకట్టవేయడం ద్వారా క్రైమ్ రేట్‌ను తగ్గించేందుకు ఏఐటీఎంఎస్ ఉపయోగపడుతుందని సీపీ భావిస్తున్నారు. నేరస్తుల ఫొటోలు, ఇతర వివరాలతోపాటు స్టేట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, నేషనల్‌క్రైమ్ రికార్డ్స్ బ్యూరోలోని డేటాను ప్రాజెక్టుకు అనుసంధానిస్తే వారు కనిపించగానే ఫేషియల్ రికగ్నైజేషన్ ద్వారా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం చేరుతుంది. దీనివల్ల ఏదైనా నేరం జరిగితే నిందితులను పట్టుకోవడంతోపాటు పాతనేరస్తులను, దాగివున్నవారిని సులభంగా పట్టుకునేందుకు వీలుంటుంది.

భారీగానే వ్యయం

ఏఐటీఎంఎస్ ప్రాజెక్టు అమలుకు కనీసం రూ.250 కోట్ల నుంచి రూ.500 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. అంతమొత్తాన్ని పోలీస్, జీవీఎంసీ భరించే పరిస్థితి లేదు. దీంతోకలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌తోపాటు ఎంపీ శ్రీభరత్‌తో చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరిస్తే ప్రాజెక్టును మూడుదశలుగా చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేశారు. దీనికి ఆమోదం లభిస్తే దేశంలోనే ఈ విధానం అమలుచేసిన మొదటి నగరంగా విశాఖకు గుర్తింపు దక్కుతుంది.

ఐదు జంక్షన్లలో డెమో

ప్రాజెక్టును అమలుచేయడానికి ముందు ఐదు సంస్థలతో పైలట్ ప్రాజెక్టుగా నగరంలోని ఐదు జంక్షన్లలో గతనెల పది, 11 తేదీల్లో ఉదయం పది నుంచి రాత్రి పది గంటల వరకు డెమో నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల గుర్తింపు, వివరాలు సేకరించారు. ఎయిర్‌పోర్టు జంక్షన్ వద్ద హెల్మెట్‌లేకుండా వాహనం నడుపుతున్న 3,672 మంది ఫొటోలు, వీడియోలు తీసింది. 294 ట్రిపుల్‌రైడింగ్ వాహనాలను గుర్తించింది. సంగం శరత్ జంక్షన్‌లో రాంగ్‌రూట్‌లో వెళుతున్న 2,101వాహనాలను, నోపార్కింగ్ జోన్‌లో పార్క్ చేసిన 783 వాహనాలను గుర్తించింది. ఊర్వశిజంక్షన్ వద్ద సీట్‌బెల్ట్ పెట్టకుండా కారు డ్రైవింగ్ చేస్తున్న 2,631 మందితో పాటు 1,256 సిగ్నల్ జంపింగ్ వాహనాలను గుర్తించింది. రైల్వేస్టేషన్ డీఎల్‌ఓ జంక్షన్ వద్ద డెమోలో భాగంగా 35 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని నిర్ణయించగా అంతకంటే ఎక్కువ వేగంతో వెళుతున్న 3,412 వాహనాలను గుర్తించింది. ద్వారకాబస్‌స్టేషన్‌లో అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని టూటౌన్ పోలీసులకు పంపింది. దీంతో నాలుగు సంస్థలు సీపీకి డీపీఆర్‌ను అందజేశాయి.

త్వరలోనే ఆర్‌ఎఫ్‌పీ పిలుస్తాం

ఏఐ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు డెమో విజయవంతమయింది. నాలుగు సంస్థలు డీపీఆర్ అందజేశాయి. త్వరలో ఆర్ఎఫ్‌పీ పిలుస్తాం. నిధులను సమకూర్చుకునే అంశంపై ఆలోచిస్తున్నాం. కేంద్ర సహకారం కోసం ఎంపీ శ్రీభరత్ సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే నగరంలో రోడ్డుప్రమాదాలు, నేరాల సంఖ్య తగ్గుతుంది.

\- శంఖబ్రత బాగ్చి, సీపీ

లెక్క తేల్చండి!

... 5వ పేజీ తరువాయి

విక్రయిస్తున్నారు. సమీపంలోని లేఅవుట్ నుంచి టన్ను రూ.400కు ఆనందపురం మండలం గండిగుండం, రామవరం, భీమన్నదొరపాలెం గ్రామాలకు చెందిన పలువురు కొనుగోలుచేశారు. దీంతో పాటు ఇనుము, సిమెంట్ కొనుగోలుచేయడం బహిరంగ రహస్యం. ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి, సబ్బవరం మండలాల్లో లేఅవుట్‌ల నుంచి సమీప గ్రామాలకు ఇసుక పబ్లిక్‌గా తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇంకా ప్రతి ఇంటికీ 20 టన్నుల ఇసుక వినియోగించాల్సి ఉన్నా అంత కంటే తక్కువగా వాడుతున్నారు. రూ.1.8 లక్షలతో చేపట్టిన ఇంటి నిర్మాణాలకు, రూ.2.15 లక్షలతో నిర్మించే ఇళ్లకు మధ్య ఇసుక వినియోగంలో తేడా ఉంది. అయినా రెండింటికి ఒకే విధంగా ఇసుక అవసరమని అధికారులు గనులశాఖకు ఇన్‌వాయిస్‌లు జనరేట్ చేస్తున్నారు. కొందరు ఏఈల చేతివాటం హౌసింగ్ సంస్థకు తలనొప్పిగా మారింది. ఇదిలా వుండగా ఉమ్మడి జిల్లాలో నదుల నుంచి తవ్విన ఇసుకను రాజమండ్రి నుంచి తెస్తున్నామని ఒక ట్రాన్స్‌పోర్టర్ తప్పుడు రవాణా బిల్లులు పెట్టారనే ఆరోపణలున్నాయి. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్, ఇసుక సరఫరా, వినియోగంపై పూర్తిస్థాయిలో లెక్కలు తేల్చడానికి వీలుగా ఆడిట్ చేయాలని ఆదేశించారు. త్వరలో గనులుశాఖ, హౌసింగ్ సంస్థ సంయుక్తంగా ఇసుక వినియోగంపై లెక్కలు తేల్చనున్నాయి.

కాంట్రాక్టర్‌కు నోటీసులు

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. కానీ జోన్-6 రెవెన్యూ అధికారులు కాంట్రాక్టర్ మార్చి నుంచి మే వరకు వసూలుచేసిన ఆశీలు మొత్తాన్ని జీవీఎంసీకి చెల్లించి, మిగిలిన తొమ్మిది నెలలకు వేలం మొత్తాన్ని లెక్కించి వసూలుచేసేలా స్టాండింగ్ కమిటీ తీర్మానం చేసినట్టు మినిట్స్‌లో నమోదు చేయించారు. దీనిపై ఈనెల 11న 'గాజువాక మార్కెట్‌లో మాయగాళ్లు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జోన్-6 రెవెన్యూ అధికారులు మార్కెట్ ఆశీలు కాంట్రాక్టర్‌కు నోటీసు జారీచేశారు.

బీజేపీలో జోష్

... 5వ పేజీ తరువాయి

మాట్లాడారు. దేశం, రాష్ట్రం అభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి కోసం తెచ్చిన పరిశ్రమలు, ప్రాజెక్టుల గురించి వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదని, ఇందుకు అవసరమైన నిధులను ఇస్తోందన్నారు. భవిష్యత్తులో మరింత చేయూత అందిస్తామని స్పష్టం చేశారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోయేందుకు మోదీ ఇతోధికంగా సాయపడుతున్నారన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునేందుకు గతంలో వాజపేయి, ఇప్పుడు మోదీ సర్కారు అందించిన సహాయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. సుమారు రూ.11,500 కోట్ల గ్రాంట్‌ను ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంటుకు అందించి ఆదుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా కంకణ బద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత బీజేపీ తీసుకుందన్నారు. అగ్ర నాయకుల ప్రసంగాలకు పార్టీ శ్రేణుల నుంచి మంచి స్పందన వచ్చింది. అంతకుముందు పార్టీ నాయకులకు శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఓపెన్ టాప్ వాహనంపై నడ్డా, మాధవ్ తదితర నేతలు ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్నారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను సందర్శించారు. అరకు కాఫీ, ఏటికొప్పాక బొమ్మలు, కొబ్బరిపీచుతో తయారు చేసిన వస్తువులు, పొందూరు ఖాదీ ఉత్పత్తులను పరిశీలించారు. నడ్డాతో పాటు ఇతర ప్రముఖులకు జీసీసీ అధికారులు బహుమతులను అందించారు. అనంతరం వేదికపైకి చేరుకున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్‌కు రాష్ట్ర నేతలు స్వాగతం పలికారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామ రాజు ఆధ్వర్యంలో జేపీ నడ్డా, మాధవ్‌లను గజమాలతో సత్కరించారు. అంతకుముందు సభా ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, విష్ణుకుమార్ రాజు, కామినేని శ్రీనివాస్, నడుకుదిటి ఈశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

భారీగా హాజరైన శ్రేణులు..

సభకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే సభా ప్రాంగణానికి రావడం మొదలుపెట్టారు. 11 గంటలకు ముఖ్య నాయకులు వేదికపైకి వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ సాగింది. వర్షం వచ్చినా ఆటంకం లేకుండా భారీ రెయిన్ ప్రూఫ్ టెంట్లు వేశారు.

ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఏపీఐఐసీ రీజనల్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కృషి చేసిన వ్యక్తులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు.

నియోజకవర్గంలో ప్రసాదుల శ్రీనివాస్ చేసిన సేవలు ప్రశంసనీయ మైనవని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, బొండా జగన్, కాకి గోవిందరెడ్డి, రౌతు శ్రీనివాసరావు, రాజాన రామారావు, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, రట్టి వాసు, కర్రి దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ప్రసాదుల శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు



శ్రీనివాస్‌ను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ప్రసాదుల శ్రీనివాస్‌ను సత్కరించిన టీడీపీ మండల నాయకులు

పెదగంట్యాడ: ఏపీఐఐసీ రీజనల్ డైరెక్టర్‌గా నియమితులైన ప్రసాదుల శ్రీనివాస్‌ను టీడీపీ పెదగంట్యాడ మండల నాయకులు గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు, టీడీపీ 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య, టీడీపీ సీనియర్ నాయకులు బొంగు రాజు, ఉరుకూటి అప్పలరాజు, ఉరుకూటి అప్పారావు, గోక్యాడ ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.



విప్ చిరంజీవిరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గాజువాక ఎంఈవో-1పై చర్యలు తీసుకోవాలని వినతి

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గాజువాక మండల విద్యాశాఖాధికారి-1పై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీటీఎఫ్ మండల నాయకులు ఆదివారం ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావును నగరంలో కలిఇ వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన బిల్లులను పెట్టడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, ప్రభుత్వం నుంచి వచ్చిన గ్రాంట్లను సక్రమంగా పంపిణీ చేయడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులచే పని చేయిస్తున్నారని వివరించారు. అలాగే ఉపాధ్యాయ సంఘ నాయకుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, ఉపాధ్యాయులు ఏదైనా సమస్య పరిష్కారం కోరితే వారిని బెదిరిస్తున్నారన్నారు. అయా అంశాలపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చిరంజీవిరావును కలిసిన వారిలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సత్యనారాయణ, పల్లా అప్పారావు, తదితరులు ఉన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండుగ

మల్కాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం గ్రామంలో పలువురు మరిడిమాంబ అమ్మవారికి ఘనంగా పూజలు చేపట్టారు. గతంలో హెచ్‌పీసీఎల్ విస్ఫోటం ఘటన నుంచి తమ గ్రామాన్ని అమ్మవారు కాపాడారనే విశ్వాసంతో ఏటా ఈ పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నగరాల వీధి నుంచి అనేక మంది భక్తులకు అమ్మవారికి ఆలయానికి భక్తులు కాలినడకన వెళ్లి పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

అమ్మవార్ల పండుగలు ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవతలు కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల పండుగలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అక్కిరెడ్డిపాలెంలోని డ్వాక్రా రీసోర్స్ పర్సన్‌లు రూ.లక్షా 20 వేలు విలువ చేసే రెండు వెండి హారాలను అమ్మవార్లకు బహూకరించారు. కార్యక్రమంలో ఆర్పీలు జి.సత్యవతి, ఎస్.లక్ష్మి, జి.ఈశ్వర లక్ష్మి, ఎం.ఝాన్సీ, కె.లక్ష్మి, పి.చంటమ్మ, ఆర్.గౌరి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నేవీ సన్నాహక మారథాన్

డిసెంబరు 14న భారీ ఎత్తున 'వన్ రన్-నేషన్ మారథాన్' నినాదంతో నిర్వహణ

విశాఖపట్నం, సెప్టెంబర్ 14, (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరంలో 'వన్ రన్-వన్ నేషన్' నినాదంతో డిసెంబర్ 14న నిర్వహించనున్న వైజాగ్ నేవీ మారథాన్-2025కు సంబంధించి ఆదివారం బీచ్‌రోడ్డులో సన్నాహక మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 42కె, 21కె 10కె, 5కె పరుగు పందాలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పలువురు క్రీడాకారులు, ఔత్సాహికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కెప్టెన్ ఎం.డి. అనూప్‌రాజ్ మాట్లాడుతూ క్రీడలతో ఒత్తిడి దూరమై మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యం సొంతమవుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులు నిత్యం విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు తమకు ఆసక్తి ఉన్న క్రీడాంశంలో సాధన చేయాలని సూచించారు. జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ నిత్యం విధుల్లో సతమతమయ్యే ఉద్యోగులు తరచూ అనారోగ్యం బారిన పడుతుంటారని, అలాంటి వారు రోజూ క్రీడలు సాధన చేస్తే ఇబ్బందులు తొలగి, ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఏటా ఇలాంటి పోటీలు ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. నేటి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని వెల్లడించారు. అనంతరం పరుగు పందాల్లో గెలుపొందిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కెప్టెన్ వినోద్ తివారీ, డిప్యూటీ రేస్ డైరెక్టర్, లెఫ్టినెంట్ కమాండర్ మెగ్నాన్ట్ నాయుడు, రేస్ కో-ఆర్డినేటర్ జోన్-3 కమిషనర్ శివప్రసాద్, నేవీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు



ఆర్కే బీచ్ వద్ద సన్నాహక మారథాన్ కార్యక్రమంలో పాల్గొన్న నేవీ సిబ్బంది, తదితరులు

ఉల్లి వ్యాపారిపై ఇనుప రాడ్డుతో దాడి

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉల్లి వ్యాపారిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 65వ వార్డు బానోజీ కాలనీకి చెందిన కొల్ల సంతోశ్ (25) ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతనెల 31న దువ్వాడ బ్రిడ్జి వద్ద ఉల్లిపాయలు విక్రయిస్తుండగా 86వ వార్డు రాజీవ్ నగర్‌కు చెందిన మేడిశెట్టి శ్రీను అనే వ్యక్తి ఆయనతో గొడవ పడ్డాడు. శ్రీనుకు ప్రకాశ్ అనే వ్యక్తి సహకరించడంతో... శ్రీను తన వద్దనున్న ఇనుప రాడ్డుతో సంతోష్ తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన సంతోశ్‌ను సహచర వ్యాపారులు అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. తనను చంపేందుకే శ్రీను దాడికి పాల్పడినట్టు సంతోష్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా నిందితులపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమని సంతోశ్ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిందితులపై చర్యలు తీసుకోకపోతే బాధితుని కుటుంబ సభ్యులతో కలిసి సీపీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామని సమాచార హక్కుల పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ కె.కృష్ణకుమార్ పేర్కొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

అగనంపూడి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లో గల శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీవారిని పుష్పాలతో అలంకరించి పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 18 వరకు ప్రత్యేక పూజలు, హోమాలు, లక్ష కుంకుమార్చన, లక్ష తులసీపూజ, పూర్ణాహుతి, పంచామృతాభిషేకాలను నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త ఈకే చారి తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధి ఎం.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాల ఆవిష్కరణ

అగనంపూడి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెదమడక కొండపై వెలసిన శ్రీమాతా దుర్గాభవానీ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ నెల 22 నుంచి అక్టో బరు 2 వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ధర్మకర్త బల్ల పైడిరాజు తెలిపారు. కూటమి నాయకులు ఇల్లపు ప్రసాద్, జి.అప్పారావు, బి.చందూరమేశ్, వెంకటరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం నేడు ఖాళీ కంచాలతో నిరసన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అడ్మిన్ భవనం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఖాళీ కంచాలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నాయకులు తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు నిరసన చేపడతామన్నారు. అలాగే బీసీ గేటు వద్ద ఇంటక్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు యూనియన్ నాయకులు పేర్కొన్నారు.

అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ అజెండా: ఎమ్మెల్యే 'పల్లా'

పెదగంట్యాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):: అభివృద్ధే అజెండాగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 75వ వార్డు పరిధి కండిపిల్లి కాలనీలో రూ.16.70 లక్షలతో జీవీఎంసీ ఏర్పాటుచేసిన చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్, ఆట పరికాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూర్చేందుకు ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు వెచ్చిస్తుం దన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, టీడీపీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పి.సోమునాయుడు, ములకలపల్లి పెంటయ్య, కె.రమణ, డి.పెరుమాళ్లు, న్యాయవాది బసా అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బావిలో ఆర్టీసీ కండక్టర్ మృతదేహం

» మతిస్థిమితం లేకపోవడంతో స్నానానికి దిగి మృతి చెంది ఉండవచ్చని అనుమానం » మృతుడు మల్కాపురం వాసి



మృతుడు లక్ష్మీనారాయణ మూర్తి (ఫైల్ ఫొటో)

పాడేరురూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని పీఎంఆర్సీ భవనానికి సమీపంలోని రేకుల కాలనీలో గల తాగునీటి బావిలో ఆర్టీసీ కండక్టర్ మృతదేహాన్ని ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించారు. స్థానికులు, ఎస్ఐ ఎల్.సురేశ్ అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖలోని మల్కాపురానికి చెందిన లక్ష్మీనారాయణమూర్తి(43) ఐదేళ్ల క్రితం వరకు పాడేరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా చేసేవాడు. అప్పట్లో మానసిక స్థితి బాగోకపోవడంతో విశాఖ మానసిక వైద్యశాలలో చికిత్స పొందాడు. అప్పటినుంచి ఇప్పటి వరకు మందులు వాడుతున్నాడు. విధులకు గైర్హాజరవుతుండడంతో అధికారులు అతనిని సస్పెండ్ చేశారు. ఆ తరువాత అతనిని గాజువాక డిపోనకు బదిలీ చేశారు. అక్కడ కూడా విధులు సక్రమంగా నిర్వహించకుండా సిక్ లీవ్‌లో ఉన్నాడు. ఇటీవల అతనిని వాల్తేరు ఆర్టీసీ డిపోనకు బదిలీ చేశారు. కాగా పాడేరులో విధులు నిర్వహించే సమయంలో రేకులకాలనీకి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తరచూ అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఆ మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు అన్ని చోట్లా గాలించారు. అతని మృతదేహం రేకుల కాలనీలోని బావిలో తేలి ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సురేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి విశాఖపట్నంలో ఉంటున్న మృతుని భార్య మారెడ్ల గాయత్రికి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులతో ఆమె పాడేరు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా లక్ష్మీనారాయణమూర్తికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో బావిలో స్నానానికి దిగి మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు.

టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా మురళీ మనోహర్



మురళీ మనోహర్

గాజువాక, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ వాణిజ్య విభాగం నూతన కమిటీని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం నియమించారు. కమిటీ అధ్యక్షుడిగా నందిరెడ్డి మురళీ మనోహర్, ప్రధాన కార్యదర్శిగా నందిక శివారెడ్డితో పాటు మరికొంత మందిని నియమించారు. మురళీ మనోహర్ ఎంతోకాలంగా టీడీపీలో కొనసాగుతూ పార్టీకి విశేష సేవలందిస్తున్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 28, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 18, క్యారెట్ 46, దొండకాయలు 38, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు (బ్రాయిలర్)	
రైతు ధర	132
లైవ్ ధర	152
విత్ స్కిన్	274
స్కిన్‌లెస్	284

విశాఖలో కేటీఎం డ్యూక్ 160 బైక్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేటీఎం కొత్తగా రూపొందించిన డ్యూక్ 160 బైక్‌ను కేటీఎం అథరైజ్డ్ డీలర్ వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ (విశాఖపట్నం) అందుబాటులోకి తీసుకువచ్చింది. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ఇతర అతిథులు సౌత్ సేల్స్ సర్కిల్ హెడ్ వి. కార్తీక్, ఏపీ ఏరియా సేల్స్ మేనేజర్ పి. హరీశ్, వరుణ్ బజాజ్ సీఈఓ ఆడారి శ్రీనివాస్‌తో కలిసి కేటీఎం డ్యూక్ 160 బైక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభు కిశోర్ మాట్లాడుతూ ఇది కేవలం బైక్ లాంచ్ మాత్రమే కాదని, ప్యాషన్, పవర్, పెర్ఫార్మెన్స్‌ల పండుగ అని తెలిపారు. కొత్త బైక్‌ను ప్రత్యక్షంగా చూడడమే కాకుండా టెస్ట్ రైడ్ కూడా చేయవచ్చునని చెప్పారు. సౌత్ సేల్స్ సర్కిల్ హెడ్ వి.కార్తీక్ మాట్లాడుతూ కేటీఎం 160 బైక్ ప్రత్యేక స్టైల్‌ను సంతరించుకుందన్నారు. పవర్‌తోపాటు పూర్తిస్థాయి టెక్నాలజీ ఈ బైక్ సొంతమని తెలిపారు. కేటీఎం గ్లోబ్ బ్రాండ్ డిస్‌ప్లే, ఇతర అంశాలను ప్రదర్శించిన తీరు వినియోగదారులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ ఉద్యోగులు, సిబ్బందిపాల్గొన్నారు.



కేటీఎం డ్యూక్160 బైక్ ఆవిష్కరణలో వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్, బైక్‌పై ప్రభు కిశోర్

గుండెపోటుతో రైతు మృత్యువాత

» నిరసన శిబిరంలో కుప్పకూలిన బాధితుడు



చంద్రరావు (ఫైల్ ఫొటో)

పెందురిరూరల్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): తమకు భూములకు తగిన నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ తలపెట్టిన ఆందోళన శిబిరంలోనే ఓ బాధిత రైతు గుండెపోటులోనై దుర్మరణం చెందారు. ఈ ఘటన మండల పరిధి పోర్లుపాలెంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలివి.. అదనపు రైల్వే ట్రాక్ నిర్మాణానికి రైల్వేశాఖ స్థానిక రైతుల నుంచి భూములను సేకరిస్తోంది. ఈ స్థితిలో పరిహారం కోసం నిరసన చేపడుతున్నారు. గ్రామానికి చెందిన రాపర్తి చంద్రరావు (61) శిబిరంలో ఆదివారం నినాదాలు చేస్తూ ఒక్కసారిగా గుండెపోటుకులోనై మృత్యువాత పడ్డారు. ఈ సంఘటనపై మాజీ ఉప సర్పంచి రెవెన్యూ, పోలీసు, రైల్వే అధికారులకు సమాచారమిచ్చారు. మృతుడు చంద్రరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'మార్నింగ్ వాక్': ఎమ్మెల్యే పంచకర్ల

వేపగుంట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ఈ మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్నట్టు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తెలిపారు. జీవీఎంపీ 93వ వార్డు పరిధి సమతాకాలనీ, ఈస్ట్ పాయింట్ కాలనీ, ఎల్లపు చంద్రయ్య వీధి, గణేష్ కాలనీ రోడ్ నెంబర్ 9, గోపీ జనవల్లభస్వామి గుడి పరిసరాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదివారం ఉదయం పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు తమ పింఛన్ సమస్యలను తెలియజేశారు. గెడ్డలు ఆనుకొని ఉన్న వంతెన వద్ద రిటైనింగ్ వాల్స్, యుజీడీ గోతులు పూడ్చటం, రహదారుల నిర్మాణం, సూర్యకాంతం లేఅవుట్‌లో ఆక్రమణలు తదితర అంశాలపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వీటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తికన్నా, జెడ్పీ హెచ్. శంకరరావు, ఈఈ దిలీప్, డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఎంహెచ్. ఓ.బండారు అప్పలనాయుడు, స్థానిక నాయకులు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పార్కులో లైటింగ్ పనులకు శ్రీకారం

ఎన్ఏడీ జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీ దరి సీతారామరాజునగర్ కాలనీలో పార్కులో జీవీ ఎంసీ రూ.19.99 లక్షలతో చేపట్టిన డెకొరేటివ్ లైటింగ్ పనులను వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాదిన్నర కాలంలో వార్డులో దాదాపు రూ. 3 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ట్రాన్స్‌కో ఏఈ ప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంతోషి, కా లనీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, గణపతి రాజు, రాము, నాయుడు, కె.ఎస్. ఎన్. రాజు, యోగా సమితి, వాకర్స్ అసోసియేషన్ తదితరులు పాల్గొన్నారు.



గెడ్డ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమేశ్ బాబు

రక్త దాన శిబిరానికి స్పందన

పెందుర్తిరూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):రంగరాయ వెలమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సుజాతనగర్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి అధికారులు పాల్గొని దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, కార్పొరేటరు శానాపతి వసంతా శంకరరావులు పాల్గొని దాతలను అభినందించారు. 60 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. అసోసియేషన్ ప్రతినిధులు లగుడు లక్ష్మీ శ్రీనివాస్, తైనాల మహేశ్, ఆర్.ఆనందరావు, వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌లతో పేదలకు మేలు



మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ దినకర్

మల్కాపు రం, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): కూట మి ప్రభుత్వం పేద ప్రజలకు న్యాయం చేసే విధంగా ముందుకు వెళ్తోందని ఏడు వార్డుల (40, 58 నుంచి 63) కూటమి పార్టీల కో-ఆర్డినేటర్ విశ్వనాథుల దినకర్ పేర్కొన్నారు. 59వ వార్డు హిమాచల్‌నగర్ సచివాలయంలో ఇళ్ల రిజిస్ట్రేషన్‌ల లబ్ధిదారులతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 5172 మంది ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌లు చేయించనున్నారన్నారు. వీఆర్‌వోలు శివశంకర్, రవితేజ, టీడీపీ నాయకులు పొట్టిమూర్తి, ఉరుకూటి మహేశ్, దామోదర్, శివ, ఎం. రావ్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో 5కే రన్

పెందుర్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆక్సియన్ ఫిటినెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పెందుర్తిలో 5కే మారథాన్ నిర్వహించారు. పెందుర్తి నుంచి సుజాతనగర్ వరకు ఈ పరుగును క్లబ్ సభ్యులు పూర్తిచేశారు. యువత శారీర దారుఢ్యంపై అవగాహనకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు క్లబ్ ప్రతినిధి వేగి వినయ్ తదితలు పాల్గొన్నారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు ఆత్మీయ వీడ్కోలు



విమానాశ్రయంలో పార్టీ శ్రేణులకు అభివాదం తెలుపుతున్న జేపీ నడ్డా

గోపాలపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని తిరిగి ప్రయాణమైన బీజేపీ జాతీ య అధ్యక్షుడు జేపీ నడ్డాకు పార్టీ శ్రేణులు విమానాశ్రయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న నడ్డాకు ఘనంగావీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో డిల్లీ వెళ్లారు.